www.velthuru.com

RNI TEL TEL/ 2019 / 78609

రంగారెడ్డి

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దినపత్రిక

శనివారం 11 జనవరి 2025

సంపుటి :06 సంచిక : 224 , పేజీలు : 12 వెల:రూ.5/-

TELANGANA, ANDHRA PRADESH




## మరుభూమిలా లాస్ఏంజిల్స్ నగరం

- కాలి బూడిదైన పదివేల ఆవాసాలు
- సందెట్లో సడేమియాలా లూటర్లు 20మంది అరెస్ట్
- అగ్నికి ఆహుతైన అతిపెద్ద బన్నీ మ్యూజియం



## ప్రభుత్వ పథకాల అమలు గురుతర బాధ్యతలు కలెక్టర్లదే

- కలెక్టర్ల సమావేశంలో మంత్రి పొంగులేటి

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 10:**
కలెక్టర్ల సమావేశంలో రెవిన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం ఒక నెలలో ఎన్నో ప్రజోపయోగ పనులను చేసామన్నారు,ఈనెల 26 వ తేదీన ప్రారంభించే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డ్స్, ఇందిరమ్మ

# 26 నుంచి రైతుభరోసా, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'

- సాగుయోగ్యమైన భూమికి మాత్రమే రైతుభరోసా
- అనర్హులకు పథకాలు అందకుండా చూడాలి
- ప్రభుత్వ పథకాలకు పూర్తి బాధ్యత మీదే
- ప్రజల్లోకి వాటిని సక్రమంగా తీసుకు వెళ్లాలి
- గ్రామసభలు నిర్వహించి పక్కగా అమలు చేయాలి
- అభివృద్ధి,సంక్షేమం మాకు రెండు కళ్లు
- కలెక్టర్ల సదస్సులో సిఎం రేవంత్ స్పష్టమైన ఆదేశాలు

*ఈనెల 26 నుంచి రైతుభరోసా, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. పథకాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అమలు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. నాలుగు పథకాల అమలుపై రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో గ్రామసభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించాలని.. అందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం కలెక్టర్లకు దిశానిర్దేశర చేశారు. ఈ మేరకు కలెక్టర్లతో జరుగుతోన్న సమావేశంలో సీఎం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.*



**హైదరాబాద్,జనవరి10( వెలుతురు):**
'ఈ నెల 26 తర్వాత జిల్లాల్లో పర్యటిస్తాను. అన్ని జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేస్తా. సాగు యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా చెల్లించాలి. పంట వేసినా.. వేయకపోయినా.. సాగుయోగ్యమైన భూమికి రైతు భరోసా ఇవ్వాలి. అనర్హులకు ఇవ్వొద్దు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పర్యటించి అనర్హులను గుర్తించాలన్నారు.. సాగు యోగ్యం కాని భూములను గుర్తించి మినహాయించాలి. స్థిరాస్తి భూములు, లేఅవుట్లు, నాలా కన్వర్షన్, మైనింగ్, గోదాములు నిర్మించిన భూములు, వివిధ ప్రాజెక్టులకు సేకరించిన భూముల

## ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రానికి కెటిఆర్

- ఫార్ములా-ఈ కార్ రేస్ కేసుపై చర్చలు



**సిద్దిపేట,జనవరి10( వెలుతురు):**
ఫార్ములా–ఈ కార్ రేస్ కేసు నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌ను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ కావడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. శుక్రవారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను కేటీఆర్ భేటీ అయ్యారు. మాజీ మంత్రితోపాటు బీఆర్ఎస్ నేతలు హరీశ్ రావు, బాల్క సుమన్, పాడి కౌశిక్ రెడ్డి సైతం సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన ఏసీబీ విచారణకు

## ఆదివాసీ ప్రాంతాల సమస్యల పరిష్కారానికి కృషి

### - సిఎం రేవంత్ రెడ్డి

- ఆదివాసీ ప్రజా సంఘాలు, ప్రజా ప్రతినిధులతో సచివాలయం లో జరిగిన సమావేశం
- విద్యా, ఉద్యోగ, రోడ్లు, రవాణా, త్రాగు సాగు నీరు,తదితర సమస్యలపై చర్చ

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 10:**



రాష్ట్రంలోని ఆదివాసీ ప్రాంతాలు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివాసీ సంఘాలు, ప్రజా ప్రతినిధులతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల ప్రతినిధులు విద్య, ఉద్యోగావకాశాలు, రోడ్లు, రవాణా, సాగు, తాగునీటి వంటి పలు అంశాలు, సమస్యలను ముఖ్యమంత్రి కి విన్నవించారు. ఆదివాసీల కోసం ఇప్పటికే చేపట్టిన పలు విషయాలను ప్రస్తావిస్తూ వారు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. కొమురం భీమ్ జయంతి, వర్ధంతిలను అధికారిక ఉత్సవంగా నిర్వహించాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే పలు అంశాలపై అధికారులకు సూచనలిచ్చారు. ఐటీడీఏ



## ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో ఎసిబి దూకుడు

- హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి విచారణ
- నిధుల విడుదలకు అనుమతులపై ప్రశ్నలు

## గత పాలనలో అన్ని రంగాల్లో పతనావస్థ

- రాష్ట్రాన్ని సమస్యల వలయంగా మార్చేశారు
- బ్రాండ్ ఎపికి మళ్లీ మహర్దశ పట్టిస్తున్నాం
- నిర్మాణరంగానికి ప్రత్యేక ప్రోత్సాహం
- నరెడ్కో ప్రాపర్టీ షోలో సిఎం చంద్రబాబు నాయుడు

**గుంటూరు,జనవరి10( వెలుతురు):**
గత పాలకులు అన్ని రంగాలనూ పతనావస్థకు తీసుకొచ్చారని.. రాష్ట్రాన్ని సమస్యల వలయంగా మార్చేశారని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు. పడకేసిన నిర్మాణ రంగాన్ని మళ్లీ పైకి తీసుకొస్తామన్నారు. గుంటూరులోని చేబ్రోలు హనుమయ్య మైదానంలో నరెడ్కో ప్రాపర్టీ



షోను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'కొత్త ఏడాది నిర్మాణ రంగం వేగంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నా. గత ప్రభుత్వ హయాంలో ఈ రంగం అధ్వానంగా మారింది. ప్రజలు మమ్మల్ని నమ్మి 93శాతం స్ట్రయిక్ రేట్‌తో విజయం కట్టబెట్టారు. అధికారంలోకి రాగానే రాష్ట్ర పునర్ నిర్మాణం ప్రారంభించాం. ప్రధాని మోదీ విశాఖకు వచ్చి రూ.2లక్షల కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ ఇప్పుడిప్పుడే ముందుకెళ్తోంది. నిర్మాణ రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాం. ఈ రంగంపై 34లక్షల మంది ఆధారపడి ఉన్నారు. ఉచిత ఇసుక విధానం తెచ్చి నిర్మాణ రంగానికి ఊతమిచ్చాం. నరెడ్కో,

## ఎమ్మెల్సీ ఎన్నికలకు బిజెపి అభ్యర్థుల ప్రకటన

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి
- టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్క కొమురయ్య
- మరో అభ్యర్థిగా సర్వోత్తం రెడ్డిల పేర్లు వెల్లడి

**హైదరాబాద్,జనవరి10( వెలుతురు):**
తెలంగాణలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. అందరి కంటే ముందుగానే మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి ప్రత్యర్థి పార్టీలకు బీజేపీ షాక్

## యూట్యూబర్ ఫన్‌బకెట్ భార్గవ్‌కు 20 ఏళ్ల జైలు

- విశాఖ పోక్సో కోర్టు సంచలన తీర్పు

**విశాఖపట్నం,జనవరి10( వెలుతురు):**



విశాఖపట్నం ప్రత్యేక పోక్సో కోర్టు సంచలనాత్మక తీర్పు వెలువరించింది. టిక్‌టాక్, యూట్యూబ్ ద్వారా ప్రాచుర్యం పొందిన యువకుడు 'ఫన్ బకెట్'

## ఐదేళ్లలో చేయలేని పనులు.. ఆరు నెల్లలో చేసి చూపాం

- కూటమి ప్రభుత్వం ..ప్రభుత్వ విజయం
- ఈ బలం వల్లనే రెండు లక్షల 8 కోట్లు పెట్టుబడులు వచ్చాయి
- తిరుమల ఘటనతో సంక్రాంతి సంబరాలకు బ్రేక్
- గోకులాలను సంరక్షించుకోవాల్సి ఉంది
- ప్రభుత్వ డెయిరీలను దెబ్బతీసిన జగన్
- పిఠాపురం పర్యటనలో డిప్యూటి సిఎం పవన్ వెల్లడి

**కాకినాడ,జనవరి10( వెలుతురు):**
తనకు పని చేయడం తప్ప విజయం గురించి తెలియదని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. అటువంటి తనకు పిఠాపురం ప్రజలు ఘన విజయం ఇచ్చారని.. తన గాయాలకి పిఠాపురం ప్రజలు మందు వేశారని కొనియాడారు. జన్మంతా పిఠాపురం ప్రజలకి రుణపడి




ఉంటానని తెలిపారు. పిఠాపురం పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 'మీ బలం వలన రెండు లక్షల 8 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. నా గెలుపు ఆంధ్ర ఆత్మ గౌరవం.

## భూసేకరణవల్లే రైల్వే లేన్ నిర్మాణ పనుల్లో జాప్యం

- రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణను వేగవంతం చేయాలని కోరుతున్నా
- 2027 నాటికి కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లేన్ పనులు పూర్తి
- మార్చి నాటికి అందుబాటులోకి ఆధునాతన కరీంనగర్ రైల్వే స్టేషన్
- రూ.60 కోట్లతో అతి త్వరలో కొత్తపల్లి స్టేషన్ నిర్మాణం పూర్తి
- 3 నెలల్లో ఉప్పల్ ఆర్వోబీని అందుబాటులోకి తెస్తాం

**కరీంనగర్ వెలుతురు జనవరి 10:**
రాష్ట్రంలో చేపట్టిన రైల్వే లేన్ నిర్మాణ పనులు జాప్యం కావడానికి ప్రధాన కారణం



భూసేకరణ సమస్యేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఆశించిన స్థాయిలో సహకరించడం లేదన్నారు. కేంద్రం ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ భూసేకరణ సమస్య పరిష్కారం కాకపోవడంతో చాలా చోట్ల రైల్వే లేన్, ఆర్వోబీల నిర్మాణ పనుల్లో

# 26 నుంచి రైతుభరోసా, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'

(మొదటి పేజీ తరువాయి..)

వివరాలను సేకరించాలి. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల రెవెన్యూ రికార్డులను క్రోడీకరించుకోవాలి. గ్రామాల మ్యాప్‌లను పరిశీలించి క్షేత్రస్థాయిలో ధ్రువీకరించుకోవాలి. వాటిపై గ్రామ సభల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేదని సీఎం వివరించారు. ఈ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తోందని.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన కులగణన సర్వే 96 శాతం పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్లకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది కలెక్టర్లేనని అన్నారు. కలెక్టర్ల పనితీరే ప్రభుత్వ పనితీరుకు కొలమానం అని తెలిపారు. కలెక్టర్లు తమ పనితీరును మరింత మెరుగుపరుచుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని గతంలోనే ఆదేశాలు ఇచ్చాం.. కానీ కొంతమంది ఇంకా ఆఫీసులలో కూర్చునే పనిచేయాలని భావిస్తున్నారని కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. సమస్యలు వచ్చినప్పుడు సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది.. మీ పని తీరును మరింత మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మరోవైపు.. వ్యవసాయ యోగ్యం కాని భూములకు కూడా గతంలో రైతు పెట్టుబడి సాయం అందించారు.. అనర్హులకు రైతు భరోసా ఇవ్వొద్దని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో వెళ్లి అనర్హులను గుర్తించాల్సిందే.. భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించాలన్నారు. రాష్ట్రంలో వన్ రేషన్ వన్ స్టేట్ విధానాన్ని తీసుకురాబోతున్నాం.. తెలంగాణలో ఒకరికి ఒకచోట మాత్రమే రేషన్ కార్డు ఉండాలని సీఎం కలెక్టర్లకు చెప్పారు. ఈ నెల 11 నుంచి 15 లోగా పథకాల అమలుకు కావాల్సిన ప్రిపరేటరీ వర్క్ పూర్తి చేయాలని తెలిపారు. కలెక్టర్లు అర్హుల జాబితాను ఇంఛార్జి మినిస్టర్ కు అందించాలని సీఎం చెప్పారు. ఇంఛార్జ్ మినిస్టర్ ఆమోదంతోనే కలెక్టర్లు అర్హుల జాబితాను విడుదల చేయాలన్నారు. జనవరి 26న అంత్యంత ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేయబోతున్నాం.. ఇందుకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుందని, గొప్పగా పనిచేస్తున్నదన్న నమ్మకం ప్రజలకు కలిగించాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నెలలో ఒక్కసారైనా హాస్టల్స్ విజిట్ చేసి రాత్రి బస చేయాలని తెలిపారు. మహిళా అధికారులు బాలికల హాస్టల్స్‌కు వెళ్లి అక్కడి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపండని చెప్పారు. సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయికి చేరేలా చర్యలు తీసుకోండి.. జనవరి 26 తరువాత తాను ఆకస్మిక తనిఖీలు చేస్తానని అన్నారు. నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి కలెక్టర్లను హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు ప్రధాన పథకాలను ఈనెల 26వ తేదీ నుండి అమలుచేయాలని నిర్ణయించామన్నారు. భారీ వ్యయంతో కూడుకున్నప్పటికీ.. రాష్ట్రంలోని పేదలకు మేలు చేయాలన్న భావనతో విస్తృతంగా చర్చించిన మీదటే.. ఈ పథకాలను అమలు చేయాలనే నిర్ణయం తీసుకున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇప్పటికే.. ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేశామని.. ఈ పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీల భాగస్వామ్యం తీసుకోవాలని సూచించారు. లబ్దిదారుల ఎంపికను, ప్రతీ ఉమ్మడి జిల్లాలో ఇంఛార్జి మంత్రులు ఇందిరమ్మ కమిటీలతో చర్చించిన మీదటే చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రస్తుతం నిర్ణయించే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల వివరాలను ప్రతీ గ్రామంలో ఫ్లెక్సీల ద్వారా ప్రకటించాలని అన్నారు. ఇప్పటికే, రాష్ట్రంలో రూ.22000 కోట్ల రైతు రుణ మాఫీలను చేశాం.. ఈ వివరాలను కూడా ప్రతీ గ్రామంలో ప్రకటించాలని తెలిపారు. ఈ నాలుగు పథకాలను సంబంధించి సవివరమైన మార్గ దర్శకులతో ఉత్తర్వులు జారీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్దిదారులను ఎంపిక చేయాలి.. ఈ పథకాలపై జిల్లాల్లో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్లకు సూచించారు.

(మొదటి పేజీ తరువాయి..)

## ప్రభుత్వ పథకాల అమలు గురుతర బాధ్యతలు కలెక్టర్లదే

ఇళ్ల పథకాలు సమర్థవంతంగా అమలు చేసే గురుతర భాద్యత కలెక్టర్లపైనే ఉందని మంత్రి పొంగులేటీ పేర్కొన్నారు,మొదటి దశలో ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించామన్నారు,ఈ ఇందిరమ్మ ఇళ్లకు అత్యంత నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలి. జిల్లా ఇంచార్జి మంత్రి ఆమోదంతో లబ్ధిదారుల జాబితా ప్రకటించాలి. ఒక కుటుంబానికి ఒకే ఇల్లును మంజూరు చేయాలి. గతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ లలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి, వాటిని లబ్ధిదారుల భాగస్వామ్యంతో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్ల సమావేశంలో ఆదేశించారు, ఈ సమావేశంలో జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు,

## ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రానికి కెటిఆర్

సంబంధించిన పలు అంశాలను కేసీఆర్ దృష్టికి కేటీఆర్ తీసుకు వచ్చారు. ఏసీబీ విచారణలో అధికారులు అడిగిన ప్రశ్నలు, తాను చెప్పిన సమాధానాలను పూసగుచ్చినట్లు వివరించారు. అలాగే ఈనెల 16న ఈడీ విచారణకు హాజరుకావాల్సి ఉందని పార్టీ అధినేతకు కేటీఆర్ తెలిపారు. దీంతో ఈనెల 16న ఈడీ విచారణను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై కేటీఆర్‌కు ఆయన దిశానిర్దేశర చేశారు. దాదాపు గంటన్నరపాటు జరిగిన సమావేశంలో తెలంగాణ తాజా రాజకీయ పరిణామాలు, కేసులతోపాటు పార్టీ పరంగా తీసుకోవాల్సిన అంశాలపైనా నేతలకు కేసీఆర్ సూచనలు చేశారు.

## ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో ఎసిబి దూకుడు

**హైదరాబాద్,జనవరి10( వెలుతురు):**

ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్‌ఎన్ రెడ్డి ఏసీబీ విచారణ కొనసాగింది. శుక్రవారం దాదాపు 6 గంటలుగా బీఎల్‌ఎన్ రెడ్డిని ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ రికార్డులను పరిశీలించిన ఏసీబీ అధికారులు వాటిని బీఎన్‌ఎల్ రెడ్డి ముందు ఉంచి ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. హెచ్‌ఎండీఏ బోర్డు ఖాతా నుంచి ఎఫ్‌ఈవోకు రూ.55 కోట్లు రిలీజ్ చేయడంలో బీఎల్‌ఎన్ రెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. ఈ మేరకు నేడు విచారణ చేపట్టింది. అయితే ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ఆదేశాలతోనే నగదు రిలీజ్ చేసినట్లు విచారణలో బీఎల్‌ఎన్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాను ప్రొసీడింగ్స్ అన్ని పూర్తి చేశానని రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. ఇందులో తన సొంత ప్రయోజనాలు ఏమీ లేవని ఏసీబీ అధికారులకు బీఎల్‌ఎన్ రెడ్డి వివరించినట్లు సమాచారం. ఒకవైపు మంత్రి కేటీఆర్.. మరోవైపు పైఅధికారి ఒత్తిడి వల్లే రూ.55 కోట్లకు సంబంధించి తాను ప్రొసీడింగ్స్ చేసినట్లు బీఎల్‌ఎల్ రెడ్డి విచారణలో చెప్పారు. నగదు బదిలీ చేస్తే భవిష్యత్తులో ఇరుక్కుపోతామని తనకు ముందే తెలుసని ఏసీబీ అధికారులకు బీఎల్‌ఎన్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. అయినా అప్పటి పరిస్థితుల వల్లే నిబంధనలకు విరుద్ధంగా ముందుకు వెళ్లాల్సి వచ్చినట్లు చెప్పినట్లు సమాచారం. తాను ఏసీబీ విచారణకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానని, ఈడీ అడిగిన ప్రశ్నలనే మీరూ అడుగుతున్నారని ఏసీబీ అధికారులకు ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. ఈడీ అడిగిన ప్రశ్నలన్నిటికీ తాను సమాధానం ఇచ్చానని, ఏసీబీ విచారణలో బీఎల్‌ఎన్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు బిజెపి అభ్యర్థుల ప్రకటన

ఇచ్చింది. రాష్ట్రంలో రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల సంఘం ప్రకటన జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు నిజామాబాద్– ఆదిలాబాద్– కరీంనగర్–మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి పేరును బీజేపీ ఖరారు చేసింది. నిజామాబాద్ –అదిలాబాద్– కరీంనగర్– మెదక్–టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్క కోమరయ్య పేరును ప్రకటించింది. అలాగే వరంగల్– ఖమ్మం–నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సర్వోత్తం రెడ్డిని కాషాయం పార్టీ ప్రకటించింది. అన్ని ప్రధాన పార్టీల కంటే ముందే తమ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ.. ప్రచారంలోనూ దూకుడు పెంచేలా కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మెరుగైన స్థానాలు సాధించడంతో ఎమ్మెల్సీ ఎన్నికలపైనా ప్రస్తుతం ఫోకస్ పెట్టింది. ముందుగానే అభ్యర్థులను ప్రకటించి ప్రజల దృష్టిని ఆకర్షించేలా చేస్తోంది. ఈ మూడు స్థానాలను సైతం కైవసం చేసుకునే దిశగా పావులు కదుపుతోంది.

## యూట్యూబర్ ఫన్‌బకెట్ భార్గవ్‌కు 20 ఏళ్ల జైలు

భార్గవ్‌కు 20ఏళ్ల జైలు శిక్ష విధించింది. 14 ఏళ్ల బాలికపై లైంగిక దాడి చేశాడన్న ఆరోపణలతో భార్గవ్ అరెస్టయిన సంగతి తెలిసిందే. కేసు వివరాల ప్రకారం.. నిందితుడు బాధిత బాలికతో టిక్‌టాక్ వీడియోలు చేస్తూ, ఆమెను బెదిరించి, పదేపదే లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ అమానుష చర్య కారణంగా బాలిక గర్భం దాల్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. విశాఖ నగర మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ డాక్టర్ జి.ప్రేమ్ కాజల్ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించారు. ఛార్జ్‌షీట్‌తో పాటు, సాక్ష్యాలను కోర్టులో సమర్పించారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాలను పరిశీలించిన విశాఖపట్నం ప్రత్యేక పోక్సో న్యాయస్థానం నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్షను విధించడంతో పాటు, బాధిత బాలికకు నష్టపరిహారంగా రూ.4 లక్షలు చెల్లించాలంటూ ఆదేశించింది.

## మరుభూమిలా లాస్‌ఏంజిల్స్ నగరం

**లాస్ ఏంజిల్స్,జనవరి10( వెలుతురు):**

ఒకప్పుడు సంపదతో తులతూగిన లాస్ ఏంజెలెస్ నగరం నేడు మరుభూమిని తలపిస్తోంది. అక్కడ ధనవంతులు, హాలీవుడ్ స్టార్లు వదిలేసి వెళ్లిపోయిన ఇళ్లల్లో విలువైన వస్తువులను దొంగలు దోచుకుంటున్నారు. తాజాగా అక్కడి షరీఫ్ డిపార్ట్‌మెంట్ 20మంది లూటర్లను అరెస్టు చేసినట్లు ప్రకటించారు. ఎవరైనా వదిలేసిన ఆస్తుల జోలికివస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. సంక్షోభ సమయంలో ప్రజలను దోచుకునేవారు సిగ్గుపడాలని కౌంటీ సూపర్‌వైజర్ కాథరిన్ బెర్జర్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. అందుకే షరీఫ్ డిపార్ట్‌మెంట్ గస్తీలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు.పసిఫిక్ పాలిసాడ్స్ ప్రాంతాన్ని కార్చిచ్చు పూర్తిగా దగ్ధం చేసింది. ప్రపంచంలోనే అతిపెద్దదైన బన్నీ మ్యూజియం ఈ కార్చిచ్చులో పూర్తిగా దగ్ధమైంది. ఇక్కడే అతిపెద్ద బన్నీ కలెక్షన్ ఉన్నట్లు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో గతంలో స్థానం సంపాదించింది. దాదాపు 46,000 కుందేళ్ల రూపంలో ఉన్న వస్తువులు మంటల్లో కాలిపోయాయి. ఈ విషయాన్ని ఉపగ్రహ చిత్రాలు స్పష్టంగా చెబుతున్నాయి. ఇక ఆల్టడెనా ప్రాంతంలో నేడు 83 సంవత్సరాల వృద్ధుడు ఈ కార్చిచ్చులో ప్రాణాలు కోల్పోయారు. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. మొత్తం 9,000 నిర్మాణాలు కాలిబూడిదయ్యాయి. ఒక్క పాలిసాడ్స్‌లోనే 5,300 నిర్మాణాలు దగ్ధమయ్యాయి. ఉడ్‌లాండ్ హిల్స్‌లో ఓ వ్యక్తి ఉద్దేశపూర్వకంగా కెన్నిత్ కార్చిచ్చును అంటించినట్లు అనుమానించడంతో భద్రతా దళాలు అతన్ని అదుపులోకి తీసుకొన్నాయి. పాలిసాడ్స్‌లో దాదాపు 20 వేల ఎకరాలు, ఈటొన్గ ÷ర్ 13,600 ఎకరాలు, కెన్నెత్గ ÷ర్, 791 ఎకరాలు, సన్‌సెట్గ ÷ర్ 60 ఎకరాలు, హుర్స్టగ ÷ర్ 855 ఎకరాలను దహించేశాయి. ఇప్పటికే 1.80 లక్షల మంది సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాలిఫోర్నియా చరిత్రలోనే అత్యంత భారీ నష్టం చేసిన కార్చిచ్చు ఇదే. ఇప్పటివరకు అక్యూవెదర్ అంచనాల ప్రకారం నష్టం 150 బిలియన్ డాలర్లు (సుమారు రూ.12లక్షల కోట్లు)గా ఉంటుందని అంచనా వేసింది. కేవలం 24 గంటల్లోనే ఈ అంచనాలు మూడింతలు పెరగడం గమనార్హం. అమెరికాలోనే అత్యంత ఖరీదైన గృహాలు ఇక్కడ ఉండటమే ఇందుకు కారణమని ఆ సంస్థ ప్రధాన వాతావరణ శాస్త్రవేత్త జోనాథన్ పోర్టర్ తెలిపారు. తీవ్రమైన పెనుగాలుల కారణంగా మంటలు శరవేగంగా వ్యాపిస్తున్నాయి. అమెరికా బీమా రంగం కూడా ఈ కార్చిచ్చు దెబ్బకు కదేలయ్యే పరిస్థితి నెలకొంది. జేపీ మోర్గాన్, మార్నింగ్ స్టార్ అంచనాల ప్రకారం 20 బిలియన్ డాలర్ల వరకు బీమా సంస్థలకు నష్టం రావచ్చని పేర్కొంది. కాలిఫోర్నియాలోని అతిపెద్ద బీమా సంస్థ స్టేట్ ఫామ్ కొన్ని నెలల కిందటే పాలిసాడ్స్‌లోని కొన్ని ప్రాంతాల్లోని ఇళ్లకు కార్చిచ్చు ముప్పు ఉందని గ్రహించి పాలసీలు ఇవ్వడం మానేసింది. ఆర్థిక వైఫల్యాలను నుంచి కాపాడుకోవడానికే ఇలా చేసినట్లు పేర్కొంది. తాజాగా ఇప్పుడు అదే ప్రాంతంలో కార్చిచ్చు దాదాపు 5,600 ఇళ్లను కాల్చేసింది. గత మూడేళ్లలో చాలా బీమా సంస్థలు ఈ ప్రాంతాల్లో కవరేజీని తగ్గించేశాయి. మరోవైపు దక్షిణ కాలిఫోర్నియాలో కార్చిచ్చు బాధిత ప్రాంతాల్లో ఆరు నెలల పాటు ప్రభుత్వం ఖర్చులు భరిస్తుందని అధ్యక్షుడు జోబైడెన్ ప్రకటించారు. శిథిలాల తొలగింపు వంటి చర్యల్లో సాయం చేస్తామన్నారు. ఓ పక్క వేల మంది అగ్నిమాపక సిబ్బంది అక్కడ మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నా.. గాలుల కారణంగా వ్యాప్తి తీవ్రంగానే ఉంటోంది. తరచూ తక్కువ వాటర్‌ప్రెజర్ కారణంగా నీటిని చిమ్మడంలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఫైర్ హైడ్రాంట్స్‌లో కూడా నీరు వెంటనే ఖాళీ అవుతుండటం ఇక్కడి సమస్యలకు ప్రధాన కారణంగా నిలిచింది.

(మొదటి పేజీ తరువాయి..)

## ఆదివాసీ ప్రాంతాల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రాంతాలకు జనాభా ప్రాతిపదికన ప్రత్యేక కోటాలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు,స్పెషల్ డ్రైవ్ కింద ఇందిర జలప్రభ ద్వారా ఉచితంగా బోర్లు వేసేందుకు చర్యలు చేపట్టాలి. ఆదివాసీ రైతుల వ్యవసాయ బోర్లకు సోలార్ పంపుసెట్లు ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలి. ఆదివాసీ గూడాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి.ఇంద్రవెల్లి అమరుల స్తూపాన్ని స్మృతి వనంగా మార్చాలని, అమరుల కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయడం వంటి చర్యలు ఇప్పటికే తీసుకున్నాం. రాజకీయంగానూ ఆదివాసీలకు న్యాయం చేస్తూ ముందుకు వెళుతున్నాం. అలాగే ఆదివాసీలు విద్య, ఉద్యోగ, ఆర్థిక అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు,ఆదివాసీల మాతృ భాషలో విద్యను అందించడం, గోండు భాషలో ప్రాథమిక విద్యను అందించే అంశంపై అధ్యయనం చేసి నివేదిక అందించాలి. ఆదివాసీల కోసం ప్రత్యేకంగా స్టడీ సర్కిల్, మౌలిక సదుపాయాలను వెంటనే మంజూరు చేస్తున్నామన్నారు,విదేశాల్లో చదువుకునే ఆదివాసీ విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్ షిప్పులకు సంబంధించి పెండింగ్ బిల్స్ క్లియర్ చేయాలి. ఇప్పటికే మంజూరైన బీఈడీ కళాశాలకు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలి.ఆదివాసీ రాయి సెంటర్లకు భవనాలు నిర్మించేందుకు అధ్యయనం చేసి నివేదిక తయారు అందించాలి. కేస్లాపూర్ జాతరకు నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలి. ఉద్యమాల్లో ఆదివాసీలపై పెట్టిన కేసులు తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు,ఈ సమావేశంలో మంత్రి ధనసరి సీతక్క ,సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి ,ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ,ఇతర ఆదివాసీ సంఘాల నేతలు ఆత్రం సక్కు ,గోడం గణేష్ ,మేస్రం మనోహర్ , మర్స్ కోల తిరుపతి,టేకం భాస్కర్ ,జుగున్క దేవు సర్మేది ,కొడప హన్నుపటేల్ ,ఆద అమృతరావు ,మేస్రం మోతీరాం ,ఆత్రం సుగుణ ,ప్రొ. గుమ్మడి అనురాధ ,ప్రొ. అప్క నాగేశ్వర రావు ,ప్రొ. రేగ రాజేందర్ ,ప్రొ. సిదం కిశోర్ ,సిదం జగ్గు ,ఆత్రం లక్ష్మణ్ ,సోయం భీంరావు ,సిదం అర్జు ,బుర్సా పోచయ్య ,మేస్రం గంగారాం లతో పాటు ఉన్నతాధికారులు,పలువురు ప్రతినిధులు హాజరయ్యారు.

# గత పాలనలో అన్ని రంగాల్లో పతనావస్థ

(మొదటి పేజీ తరువాయి..)

క్రెడాయ్ వంటి సంస్థలు కలిసి ముందుకు రావాలి. రియల్ ఎస్టేట్ సమస్యల పరిష్కారానికి ముందుంటాం. వైకాపా పాలనలో అన్నింటికంటే ఎక్కువగా నిర్మాణ రంగం దెబ్బతింది. అధికారంలోకి రాగానే ఈ రంగానికి ప్రాధాన్యత ఇచ్చామని అన్నారు. ఎప్పుడూ చూడనివిధంగా భూ సమస్యలపై దరఖాస్తులు వస్తున్నాయి. వైకాపా ప్రభుత్వం చేసిన అక్రమాలే దీనికి ముఖ్య కారణం. భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. గత ప్రభుత్వ నిర్వాకంతో టీడీఆర్ బాండ్లు తీసుకుని కొంతమంది నష్టపోయారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ సాధన కోసం కృషి చేస్తున్నాం. మేం వచ్చాక రూ.4లక్షల కోట్ల పెట్టుబడులకు సంతకాలు చేశాం. ఐదేళ్లలో 20లక్షల మందికి ఉపాధి కల్పించాలనేదే మా లక్ష్యం' అని చంద్రబాబు అన్నారు. ఉచిత ఇసుకతో నిర్మాణ రంగానికి ఊతమిచ్చామన్నారు. నిర్మాణ రంగం నిరంతరం జరిగే ప‌క్రియ అని సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. నరెడ్కో, క్రెడాయ్ వంటి సంస్థలు ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపు నిచ్చారు. రియల్ ఎస్టేట్ రంగంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. వైసీపీ పాలనలో నిర్మాణ రంగం పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. నిర్మాణ రంగానికి తాము ఊతమిచ్చామని ఆయన వివరించారు. శుక్రవారం గుంటూరులో నరెడ్కో ప్రాపర్టీ షోను సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు.అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో అన్ని రంగాలు పతనావస్థకు చేరాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని సమస్యల వలయంగా మార్చేశారంటూ గత ప్రభుత్వంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పడకేసిన నిర్మాణ రంగాన్ని మళ్లీ పైకి తీసుకురావాల్సి ఉందన్నారు. కొత్త ఏడాదిలో నిర్మాణ రంగం అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ రంగం అధ్వానంగా ఉందని గుర్తు చేశారు. ప్రజలు తమను నమ్మి 93 శాతం స్ట్రైక్ రేట్‌తో భారీ విజయం కట్టబెట్టారన్నారు. అధికారంలోకి రాగానే రాష్ట్ర పునర్ నిర్మాణాన్ని ప్రారంభించామని ఆయన స్పష్టం చేశారు. అందులోభాగంగా రూ. 2 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోదీ.. తాజాగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారని చెప్పారు. బ్రాండ్ ఏపీ ఇప్పుడిప్పుడే ముందుకెళ్తోందన్నారు. బ్రాండ్ ఏపీ ఇప్పుడిప్పుడే ముందుకెళ్తోందన్నారు. భూ కబ్జాకారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా భూ సమస్యల దరఖాస్తులు తమకు వస్తున్నాయని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం చేసిన అక్రమాలే భూ సమస్యలకు ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. వైసీపీ నిర్వాకంతో టీడీఆర్ బాండ్లు తీసుకుని నష్టపోయారన్నారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంటు సాధన కోసం కృషి చేస్తున్నామని వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత.. 4 లక్షల కోట్ల పెట్టుబడులకు సంతకాలు చేశామన్నారు. ఈ ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉపాధి కల్పించాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# ఐదేళ్లలో చేయలేని పనులు.. ఆరు నెల్లలో చేసి చూపాం

(మొదటి పేజీ తరువాయి..)




రాష్ట్రంలో మౌళిక సదుపాయాలు అభివృద్ధి కావాలి. తిరుమలలో జరిగిన ఘటన బాధ కలిగించింది. సంక్రాంతి కి పిఠాపురంలో ఊరంతా పందిరి వేద్దాం అనుకున్నాను.. కానీ తిరుమల ఘటనతో తగ్గించి చేస్తున్నాను. కుదిరితే దసరా బాగా చేసుకుందాం.' అని డిప్యూటీ సీఎం తెలిపారు. 'ఓట్లు కోసం బుగ్గలు నిమరడం, తల కాయలు నిమరడం కాదు. మీరు పిఠాపురం గెలిపించిన వ్యక్తి గిరిజనులకి రోడ్లు వేయించడానికి పని చేస్తున్నాడు. మనసు మానవ సహజం..రాజకీయాల్లో ఎవరు పెట్టుకోరు. అన్నమయ్య జిల్లాలో గత ప్రభుత్వంలో ఉన్న నాయకులు దాడి చేశారు. ఏపీ ప్రభుత్వం జీతాలతో బతికిన కుటుంబం నాది.. ఆ రుణం తీర్చుకోవాలి. మా నాన్న మీద దాడి జరిగితే ఎలా స్పందిస్తారో అలా స్పందించాను. 414 గ్రామాలు ప్రజలు డోలిలతో అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం వేల కోట్లు దుర్వినియోగం చేసింది. ఓట్లు కోసం కాదు.. నాకు లెక్కలు లేవు.' అని పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అనంతరం పవన్ కళ్యాణ్ గుర్రం జాషువా కవిత చదివి వినిపించారు. గత ప్రభుత్వాన్నీ నడిపిన పెద్ద మనుషులకు ఈ ఆరు నెలలు పాలన పట్ల తృప్తి లేదట.. గత ప్రభుత్వం డైరీలను చంపేశారని తెలిపారు. ఏడీబీ రోడ్డును గత ప్రభుత్వం ఐదేళు వదిలేసిందని.. గత ప్రభుత్వం స్కామ్ లలో రికార్డు సృష్టించిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం అభివృద్ధిలో రికార్డు సృష్టించిందని వెల్లడించారు. పిఠాపురం మండలం కుమారపురంలో కృష్ణుడి ఆలయం వద్ద నిర్మించిన మినీ గోకులంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన 12,500 మినీ గోకులం షెడ్లను ఇక్కడి నుంచి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కూటమి విజయం అంటే.. ప్రజలు, రాష్ట్రం ఉమ్మడి గెలుపు అని ఈ సందర్భంగా సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. దేశం రుణం తీర్చుకోవాలని ఈ సందర్భంగా యువతకు ఆయన పిలుపు నిచ్చారు. పల్ఎలె రుణం తీర్చుకోవాలన్నది తన కోరిక అని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. అయితే గ్రామాల్లో విధులు నిర్వహించే క్రమంలో మరింత బాధ్యతగా ఉండాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు ఆయన సూచించారు. తాము అండగా ఉంటామని అధికారులకు పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. నెలల్లో ఏం చేశారని అడిగిన వారికి చెబుతున్నానంటూ .. తాము ఈ కాలంలో 12,500 గోకులాలు నిర్మించామని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం పాడి పరిశ్రమను నిర్వీర్యం చేసిందన్నారు. భవిష్యత్తులో మరో 20 వేల గోకులాలు ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. గత ప్రభుత్వం అమూల్‌ను తీసుకొచ్చి.. ప్రభుత్వ డెయిరీలను చంపేసిందని మండిపడ్డారు. గత జగన్ ప్రభుత్వం గోకులాలపై సైతం దృష్టి పెట్టలేదన్నారు. అయితే గోవులు, గోకులాలను సంరక్షించుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు నిచ్చారు. మరోవైపు.. ఈ ఆరు నెలల్లో కూమిటి ప్రభుత్వం ఏమి చేసిందంటూ వైసీపీ అగ్రనేతలు పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై విధంగా సమాధానమిచ్చారు.



స్వదేశీ మేళా పోస్టర్ ఆవిష్కరించిన కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్ వెలుతురు జనవరి 10:

## బక్క వెంకటేష్ గౌడ్ ను అభినందించిన మెదక్ బిజెపి జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్



**మెదక్ జిల్లా వెలుతురు జనవరి 10:**
మెదక్ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి మండల అధ్యక్షులు , పార్టీ అధ్యక్షులు గా నియమించిన శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపిన బక్క వెంకటేష్ గౌడ్, బిజెపి జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ లు ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టపడ్డ కార్యకర్తలకు బిజెపి లో గుర్తింపు ఉంటుందని వారు సూచించారు, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు,

## లుచ్చా పనులు చేసిందే కెటిఆర్

- అప్పనంగా 55 కోట్లు దారి మళ్లించాడు
- కెటిఆర్ తీరుపై మండిపడ్డ రామ్మోహన్ రెడ్డి



**హైదరాబాద్,జనవరి10( వెలుతురు):**
మాజీ మంత్రి కేటీఆర్ తీరు జబర్దస్త్ కామిడీ షో లా కనిపిస్తోందని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఏసీబీ విచారణకు వెళ్తూ భయంగా నటించారని.. విచారణ తర్వాత బయటకు వచ్చిన కేటీఆర్‌ను స్వాతంత్ర సమర యోధుడు అయినట్లు పార్టీ శ్రేణులు స్వాగతం పలికారన్నారు. పేద ప్రజల కష్టార్జితం రూ. 55 కోట్లు విదేశీ కంపనీకి అప్పగించి లుచ్చా పని చేసింది కేటీఆర్ అంటూ విరుచుకుపడ్డారు. అబద్దాల హరీష్ రావును ఎవరు నమ్మే పరిస్తితిలో లేరన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా కేటీఆర్ మాట్లాడవద్దని హెచ్చరించారు. కేటీఆర్ జైలుకు వెళ్లడం.. చిప్పకూడు తినడం ఖాయమని స్పష్టం చేశారు. ఒకసారి విచారణకు పిలిచి అరెస్టు చేయరని.. కవిత విచారణలో కూడా అదే జరిగిందన్నారు. విచారణలో ప్రభుత్వం తలదూర్చదని.. చట్టం తనపని తాను చేసుకుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. కనకపు సింహాస నమైన సీఎం కుర్చీ మీద ఒక్కరోజులో రేవంత్ రెడ్డి కూర్చోలేదన్నారు. అంచలంచెలుగా ఎదిగి అధిష్టానం నిర్ణయంతో సీఎం అయ్యారని తెలిపారు. ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని అన్నారు. ధనిక రాష్టాన్ని టీఆర్ఎస్‌కు తాము ఇచ్చామని.. కానీ ఇచ్చిన హామీలు కూడా అమలు చేయలేదని విమర్శిం చారు. రెండు లక్షల రైతు రుణమాఫీని ఆరునెలల్లో తమ ప్రభుత్వం చేసిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల డబ్బులు కూడా త్వరలో వేయబోతున్నామన్నారు. పారిశుధ్య కార్మికులకు గ్రీన్ ఛానెల్ ద్వారా జీతాలు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఏడాదికి రూ. 12వేలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నా మన్నారు. డిజిటల్ రేషన్ కార్డులు ఇవ్వబోతు న్నామని చెప్పారు. ఆ కార్డు ప్రతీ పథకానికి ఉపయోగపడ నుందని తెలిపారు.

## అనుమతి లేకుండా ర్యాలీ

- కెటిఆర్‌పై బంజారాహిల్స్ పోలీసుల కేసు



**హైదరాబాద్,జనవరి10( వెలుతురు):**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కు బంజారాహిల్స్ పోలీసులు షాక్ ఇచ్చారు. అనుమతి లేకుండా ర్యాలీ చేశారంటూ అందిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్‌పై కేసు నమోదు అయ్యింది. గురువారం ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో భాగంగా ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను విచారించిన సంగతి తెలిసిందే. అయితే విచారణ అనంతరం ఎటువంటి అనుమతి లేకుండా ఏసీబీ కార్యాలయం నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వరకూ కేటీఆర్ పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించడమే కాకుండా ట్రాఫిక్ సమస్యలు సృష్టించారంటూ ట్రాఫిక్ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్‌పై కేసు నమోదు అయ్యింది. కాగా, ఇప్పటికే ఫార్ములా-ఈ కార్ రేస్ కేసు మెడకు చుట్టుకుని కేటీఆర్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తాజాగా మరో కేసు నమోదు అవ్వడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు గురవుతున్నారు.

## దేశంలోనే ఫ్యూచర్ సిటీ ని గొప్ప నగరంగా తీర్చిదిద్దుతాం

- సీఎం రేవంత్ రెడ్డి

- పలు అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడాలన్నదే లక్ష్యం
- గ్రీన్ బిజినెస్ సెంటర్ లో జరిగిన సి ఐ ఐ సదస్సు
- పలు దేశ విదేశాల ప్రతినిధులు









(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 10:**
ఫ్యూచర్ సిటీ పేరుతో దేశంలోనే ఒక గొప్ప నగరాన్ని నిర్మించాలన్నది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ లాంటి ప్రపంచ నగరాలతో పోటీ పడాలన్న ప్రభుత్వ ఆకాంక్షకు అనుగుణంగా పెట్టుబడులతో ముందుకు రావాలని పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం పలికారు. హైదరాబాద్‌లోని గ్రీన్ బిజినెస్ సెంటర్‌లో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (CII) జాతీయ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధిలో తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. తెలంగాణలో ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందడానికి, స్వేచ్ఛా వాణిజ్యం, మార్కెట్లు పనిచేయడానికి పారిశ్రామిక రంగం సహకరించాలని కోరారు. ప్రపంచంలోనే అత్యుత్తమ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అందించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా ఉందని చెప్పారు.

"తెలంగాణ రైజింగ్ (TelanganaRising) లక్ష్యంతో సేవల రంగం కేంద్రీకృతంగా ఫోర్త్ సిటీని నిర్మించాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష. హైదరాబాద్‌లో సంపూర్ణంగా నెట్ జీరో లక్ష్యాలతో పనిచేస్తున్నామని సిఎం తెలిపారు,హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహిత నగరంగా మార్చడంలో భాగంగా 3200 ఆర్టీసీ బస్సుల స్థానంలో విద్యుత్ వాహనాలను సమకూర్చబోతున్నాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రిజిస్ట్రేషన్, రోడ్ టాక్స్‌లను పూర్తిగా రద్దు చేశాం. ప్రస్తుతం ఎలక్టిక్ వాహనాల అమ్మకాలు అత్యంత వేగంగా పెరుగుతున్నాయని రేవంత్ రెడ్డి తెలిపారు,వరదలు లేని నగరంగా, దేశంలోనే పర్యావరణ హితమైన హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో చర్యలు చేపట్టాం. అందులో భాగంగా 55 కిలోమీటర్ల పొడవైన మూసీ పునరుజ్జీవ పనులను ప్రారంభించాం. 2050 నాటికి అవసరమయ్యే తాగునీటి అవసరాలకు అవసరమైన కార్యాచరణను ఇప్పటి నుంచే ప్రారంభించామన్నారు,తెలంగాణ మణిహారంగా రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాం. అవుటర్ రింగ్ రోడ్డుకు రీజినల్ రింగ్ రోడ్డుకు మధ్యన రేడియల్ రోడ్లను నిర్మించబోతున్నాం. ఆయా ప్రాంతాల్లో ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఈవీ, సోలార్ పవర్ వంటి పరిశ్రమలు అక్కడ ఏర్పాటు చేయబోతున్నామని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు, 360 కి.మీ పొడవు ఉండబోయే రీజినల్ రింగ్ రోడ్డు వెంట రీజినల్ రింగ్ రైల్‌ను నిర్మించాలని ప్రధానమంత్రి ని కోరాం. రీజినల్ రింగ్ రోడ్ చుట్టూ తయారీ పరిశ్రమ, మార్కెటింగ్ కు అవసరమైన కేంద్రీకృత ప్రదేశాలను ఏర్పాటు చేయాలన్నది మా ఉద్దేశమని చెప్పారు,చైనా తరహాలో రకరకాల క్లస్టర్లను సృష్టించాలని భావిస్తున్నాం. ఒక లైట్ సిటీ, మార్బుల్ సిటీ, గ్రానైట్ సిటీ, ఫర్నీచర్ సిటీ.ఇలా ప్రత్యేక తరహాలో రీజినల్ రింగ్ రోడ్డు చూట్టూ మార్కెటింగ్ కార్యకలాపాల విస్తరణకు ప్రయత్నిస్తున్నామనీ సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు,రీజినల్ రింగ్ రోడ్ పూర్తయితే తెలంగాణ ప్రాంతంలో 70 శాతం పట్టణీకరణ జరుగుతుంది. రింగ్ రోడ్డు ఆవలివైపున గ్రామీణ తెలంగాణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా వ్యవసాయం, సేంద్రీయ సాగు, రైతుల కోసం గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించిందని రేవంత్ రెడ్డి చెప్పారు,తెలంగాణకు సముద్ర తీరప్రాంతం లేని కారణంగా డ్రై పోర్టును ఏర్పాటు చేస్తున్నాం. పోర్టుతో అనుసంధానం చేయడానికి మచిలీపట్నం ఓడరేవు వరకు ప్రత్యేక రహదారి, రైల్వే కనెక్టివిటీని ప్రతిపాదించామని సిఎం తెలిపారు,నైపుణ్యత పెంచడానికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంపై ప్రధానంగా దృష్టి సారించాం. చైనా ప్లస్ వన్ వ్యూహంలో హైదరాబాద్‌ను ప్రపంచంలో ప్రధాన పెట్టుబడుల కేంద్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామనీ సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు,సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించడం శుభ పరిణామం. అత్యుత్తమ వ్యాపార సౌలభ్యాలను అందించడానికి తెలంగాణ సిద్ధంగా ఉంది. సీఐఐ కలిసిరావాలి. అందరం కలిసి అద్భుతాలు సాధించవచ్చని మా నమ్మకం" అని ముఖ్యమంత్రి గారు రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు.ఈ సమావేశంలో సీఐఐ అధ్యక్షుడు సంజీవ్ పూరి,వైఎస్-ప్రెసిడెంట్ ఆర్. ముకుందన్ ,సీఐఐ డైరెక్టర్ చంద్రజీత్ బెనర్జీ ,పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తో పాటు సీఐఐ ప్రతినిధులు, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్

- 23 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్



**హైదరాబాద్,జనవరి10( వెలుతురు):**
హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్లో భాగంగా రూ. 5.29 కోట్ల మోసాలకు పాల్పడ్డ 23 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు పోలీసులు. ఈ సైబర్ చీటర్స్ ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ రాష్టాల్లో ఉంటూ సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు పోలీసులు. తెలంగాణలో వీరిపై 30 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు పోలీసులు. పోలీసులు అరెస్ట్ చేసిన కేటుగాళ్లు దేశవ్యాప్తంగా 328 కేసుల్లో నిందితులుగా ఉన్నారని.. ఇన్వెస్ట్మెంట్, డిజిటల్ అరెస్ట్, ట్రేడింగ్, ఏపీకే, జాబ్ ఫ్రాడ్ కేసుల్లో మోసాలకు పాల్పడ్డట్లు తెలిపారు పోలీసులు. 70 ఏళ్ళ బాధిత వృద్ధుడు మొబైల్ హ్యాక్ అయ్యి రూ1.9 కోట్లు మోసపోయాయని ఫిర్యాదు చేయగా.. ఈ ఆపరేషన్ చేపట్టినట్లు తెలిపారు పోలీసులు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభం అంటూ మొబైల్ కి వచ్చే మెసేజ్ లలో ఉన్న లింకులను ఎట్టి పరిస్థితిలో క్లిక్ చేయొద్దని.. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేసి ఓటీపీలు వంటి కీలక సమాచారాన్ని ఇవ్వొద్దని సూచించారు పోలీసులు.

## కేటీఆర్..... మీరేమైనా స్వాతంత్ర్య సమరయోధుడివా?

- సర్కార్ సొమ్మును అక్రమంగా కట్టబెట్టి అడ్డగోలుగా మాట్లాడతవా?
- కేబినెట్ ఆమోదం లేకుండా కోట్లు విడుదల చేయాల్సిన అవసరం ఏంది?
- అయినా కాంగ్రెస్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?
- కేటీఆర్ విషయంలో కాంగ్రెస్ చేస్తున్నదంతా లొట్టపీసు వ్యవహారమే
- రేవంత్ ను అడ్డగోలుగా తిడుతున్నా పట్టించుకోవడం వెనుక ఆంతర్యమేంటి?
- ఢిల్లీ వెళ్లి కేసీఆర్ కప్పం కడుతున్నందుకే రేవంత్ ఏం చేయలేకపోతున్నారా?
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఫైర్.
- కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలను కేసీఆర్ కుటుంబ అవినీతిపై రాజీలేని పోరు కొనసాగిస్తామని స్పష్టీకరణ

**కరీంనగర్ వెలుతురు జనవరి 10:**
ఈ ఫార్ములా రేస్ స్కాంలో మాజీమంత్రి కేటీఆర్ వ్యవహరిస్తున్న తీరుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.




"కేసీఆర్ కొడుకేమైనా దేశం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడా? ఆయన జైలుకు వెళితే బీఆర్ఎస్ నాయకులు గొడవ చేయడానికి? కేబినెట్ అనుమతి లేకుండా సర్కార్ సొమ్మును అప్పనంగా విడుదల చేయాల్సిన అవసరమేముంది? పైగా సీఎంను పట్టుకుని లొట్టపీసు సీఎం, చిట్టినాయుడు, సన్నాసిగాడు అని తిడుతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?"అని ప్రశ్నించారు. కేటీఆర్ తిడుతున్నా సీఎం పట్టించుకోకుండా విచారణ పేరుతో అరెస్ట్ చేయకుండా జాప్యం చేస్తున్నారంటే తనకు అనేక అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. కేసీఆర్ తో రేవంత్ రెడ్డి లోపాయికారీ ఒప్పందం చేసుకున్నట్లు అనుమానమొస్తుందన్నారు. బీఆర్ఎస్ సర్కార్ చేసిన స్కాంలు తెరపైకి వచ్చినప్పుడల్లా కేసీఆర్ ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పెద్దలకు కప్పం కట్టి వస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలను ఎండగట్టడంతోపాటు కేసీఆర్ కుటుంబ అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. శుక్రవారం రోజున కరీంనగర్ లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఈ ఫార్ములా రేస్ వ్యవహారంపై మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఏమన్నారంటే... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీమంత్రి కేటీఆర్ ఒక్కటేనా? అనే అనుమానం వస్తోంది. సీఎంను పట్టుకుని లొట్టపీసు సీఎం, చిట్టి నాయుడు, సన్నాసి అని తిడుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదు? వీళ్ల మధ్య ఏమైనా లోపాయికారీ ఒప్పందం జరిగిందా? ఈ పార్ములా సహా అనేక అవినీతి ఆరోపణలున్నా ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? పైగా అడ్డగోలుగా మాట్లాడుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? పైగా అరెస్ట్ చేస్తే బీఆర్ఎస్ నేతలు గొడవ చేయాలనుకుంటున్నారు. నేనడుగుతున్నా... కేటీఆర్ ఏమైనా దేశం కోసం కొట్లాడిన స్వాతంత్ర్య సమర యోధుడదా? ప్రజా సమస్యలపై పోరాడినోడా? కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డోడు. కేబినెట్ ఆమోదం లేకుండా కోట్లు నిధులు విడుదల చేయడానికి అంత ఆత్రం ఎందుకు? ఆర్థిక శాఖ అనుమతి లేకుండా ఎట్లా రిలీజ్ చేసిండు? తప్పు చేసి కప్పి పుచ్చుకోవడానికి రూ. 700 కోట్ల లాభం వచ్చినట్లు డ్రామాలాడుతున్నరు? నీకు దమ్ముంటే 700 కోట్ల లాభం ఎట్లా వచ్చిందో లెక్క చెప్పు. ఆ లాభం వచ్చిన సొమ్ము యాడ ఉందో ప్రజల ముందుంచు. నేను అడుగుతున్నా... ఈఫార్ములా కేసులో కేబినెట్ ఆమోదం లేకుండా కోట్లు చెల్లించాల్సిన అవసరం ఏముంది? ఫీజు రీయంబర్స్ రాక లక్షల మంది విద్యార్థులు అల్లాడుతుంటే ఈఫార్ములాపై చూపిన ఆత్రం విద్యార్థులపై ఎందుకు చూపలేదు? ఆరోగ్యశ్రీ నిధుల విడుదలపై ఎందుకు చూపడం లేదు? కేటీఆర్ విషయంలో కాంగ్రెస్ చేస్తున్నదంతా లొట్టపీసు వ్యవహారమే. ఎందుకంటే బామ్మర్ధి ఫాంహౌజ్ కేసులో డ్రగ్స్ తో దొరికినా హడావుడి చేసి చివరకు లొట్టపీసు వ్యవహారం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు, కాళేశ్వరం, ధరణి భూముల వ్యవహారంపైనా హడావుడి చేసి చివరకు లొట్టపీసు వ్యవహారం చేశారు. ఎందుకంటే కేసీఆర్ కాంగ్రెస్ నుండి వచ్చినోడే. కాంగ్రెస్ కథలన్నీ తెలుసు. ఏదైమైనా స్కాం తెరమీదకు రాంగనే ఢిల్లీకి పోయి కప్పం కట్టి వస్తున్నడు. ఆ కేసులన్నీ లొట్టపీసు వ్యవహారంగా మారుతోంది.
కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే... ఈ రెండు పార్టీల రాజకీయ డ్రామాలను ఎండగడతాం. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతల అవినీతిని, కేసీఆర్ కుటుంబ బండారాన్ని పూర్తిగా ప్రజల ముందుంచి తీరుతాం. ఈ విషయంలో రాజీలేని పోరాటం చేస్తుంది. తిరుమల ఘటన దురదృష్టకరం. మనసును తీవ్రంగా కలిచి వేసింది.
ఘటన కారణాలపై విచారణ జరుగుతోంది. బాధ్యులపై ఇప్పటికే ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇకపై అలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నా.

# సంపాదకీయం..

## గగ్గోలు పెడితే.. అబద్ధాలు నిజాలు కావు !

తప్పు చేయలేదు..కానీ వేలకోట్ల ఆస్తులు మాత్రం సమకూరాయి. భూములన్నీ హాంఫట్ అయ్యాయి. ధరణి పేరుతో పేదలను జలగల్లా పీల్చారు. పథకాల పేరుతో డబ్బులు పందేరం చేశారు. సిరిసిల్లలో 2500 ఎకరాల ప్రభుత్వ భూమి అనుయాయులకు అప్పనంగా కట్టబెట్టారు. ఇదంతా యువరాజా వారు కెటిఆర్ అవినీతిపై పుంఖానుపుంఖాలుగా వస్తున్న ఆరోపణలు. చెల్లెలు కవితమ్మ కూడా అవినీతి చేయలేదు. కానీ లిక్కర్ స్కామ్‌లో ఇరుక్కుని జెయిల్‌కు వెళ్లి బెయిల్‌పై వచ్చారు. చూస్తుండగానే కాళ్లకుచెప్పులు లేని వారు కోట్లకు పడగలెత్తారు. తెలంగాణలో వీరి కుటుంబం కోట్లకు పడగలెత్తింది. దీనికి సమాధానం లేదు. ఇప్పుడు ఫార్ములా-ఇ రేస్ కేసు మలుపుల మీద మలుపులు తిరుగుతూ పవర్‌ఫుల్ యాక్షన్ మూవీని తలపిస్తోంది. మాజీ మంత్రి కేటీఆర్‌పై ఫార్ములా-ఈ రేస్ కేసు రచ్చ రేపుతోంది. ఫార్ములా-ఈ రేస్ కేసులో పైసావంతు కూడా అవినీతి జరగేలదని కెటిఆర్ వాదిస్తున్నారు. 55 కోట్లు మాత్రం ఇచ్చేశానంటున్నాడు. ఓ మంత్రిగా, ఎవరి అనుమతి లేకుండా ఇంత పెద్దమొత్తంలో డబ్బులు ఎందుకు దాటవేశారన్నదానికి సమాధానం చెప్పడం లేదు. అవినీతి జరరగలేదు. ఏం చేసుకుంటారో చేసుకోండని, వెయ్యి కేసులు పెట్టినా భయపడేది లేదన్న వాదనతో కెటిఆర్ అబద్దాన్ని నిజం చేయాలని చూస్తున్నారు. ఇక్కడ అనుమతులు లేకుండా మంత్రిగా ఇంత డబ్బును విదేశాలకు ఎలా తరలించారన్న దానిపైనే కేసు పెట్టారు. కానీ దీనికి కెటిఆర్ ఇప్పటికీ సూటిగా సమాధానం చెప్పడం లేదు. సుప్రీంకోర్టు దాకా వెళ్లి క్వాష్ పిటిషన్లు మాత్రం వేస్తున్నారు. అబద్దాలు ఆడేవారికి అరుపులు ఎక్కువ అన్నట్లుగా ఉచ్చనీచాలు మరచి ఇష్టం వచ్చినట్లుగా విమర్శలు చేస్తున్నారు. కాళేశ్వరం అవినీతి అబద్దమా..ధరణి అక్రమాలు అబద్దమా...సిరిసిల్ల భూముల పందేరం అబద్దమా...ఫార్ములా కేసులో 55 కోట్లు దాటించింది అబద్దమా.. అన్నది మాత్రం చెప్పడం లేదు. నోరుంది కదాని, రాయడానికి, వినడానికి కొందరు ఉన్నారు కదాని పదేళ్ల అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు నానాయాగీ చేస్తున్నారు. ఎసిబి విచారణను తప్పుపడుతున్నారు. ఇక్కడ గమనించాల్సిందేమంటే.. అరెస్టును నిలుపుదల చేయాలన్న కేటీఆర్ అప్పీల్ కూడా తిరస్కరణకు గురైంది. ఈ క్రమంలో కేటీఆర్‌కు మరోసారి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న విచారణకు రావాలని ఈడీ అధికారులు నోటీసుల్లో తెలిపారు. నాపై అక్రమ కేసు పెట్టారని, ఇది రాజకీయ ప్రేరేపిత లొట్టపీసు కేసు అని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ కేసులో అసలు పసలేదని భావిస్తే...హైకోర్టు క్వాష్ పిటిషన్ ఎందుకు కొట్టేసినట్లు..కెటిఆర్ సమాధానం చెప్పాలి. ఎసిబి విచారణ చేయవచ్చని కూడా చెప్పింది. అవినీతిపరులకు అంతా అవినీతే కనిపిస్తుందని ఆరోపించి నంత మాత్రాన కెటిఆర్ అవినీతి వ్యవహారం నుంచి తప్పించుకోలేరని గుర్తించాలి. అధికారం అడ్డుపెట్టుకుని అక్రమకేసు పెట్టారని ఆరోపిస్తున్న కెటిఆర్...అదే అధికారం అడ్డం పెట్టుకుని పదేళ్ల పాటు విచ్చలవిడిగా చేసిన అక్రమాలపై ఎందుకు సమాధానం చెప్పడం లేదు.నేనెలాంటి తప్పూ చేయలేదని, నాకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంది... సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తా... జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో చర్చకు సిద్ధం...ఏసీబీ, ఈడీ విచారణకు కూడా హాజరవుతా ..అంటున్న కేటిఆర్ పదేపదే కోర్టు మెట్లు ఎక్కాలని ఎందుకు చూస్తున్నారో చెప్పాలి. ప్రపంచంలో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు తేవాలని ఫార్ములా ఈ-కార్ రేస్‌ను నిర్వహించామని, దాని నిర్వహణకు సంబంధించిన విధానపరమైన నిర్ణయాలకు మంత్రి హోదాలో సంతకాలు చేశానని ఏసీబీ అధికారుల ప్రశ్నలకు కేటీఆర్ సమాధానమిచ్చినట్టు సమాచారం. అయితే ఆర్థిక అనుమతులు లేకుండా ఎందుకు డబ్బును దాటించారన్న దానికి సూటిగా సమాధానం చెప్పడం లేదు. డొంకతిరుగుడు మాటలు మానేసి డబ్బులు ఎందుకు దాటించారో చెప్పాలి. కానీ దీనికి సమాధానం లేదు. ఈ ఫార్ములా ఆగిపోవడంతో హైదరాబాద్ బ్రాండ్ దెబ్బతిన్నదని గగ్గోలు పెడితే చెవిలో ఎవరూ పూలు పెట్టుకోలేదని గుర్తించాలి. ముఖ్యంగా క్యాబినెట్ ఆమోదం లేకుండా డబ్బులు ఎలా బదిలీ చేశారనే అంశం గురించి ప్రశ్నిస్తుంటే..ఇంతవరకు కెటిఆర్ లేదా ఆయన అనుచర గణం సమాధానం ఇవ్వండ లేదు. ఈ ఒక్క కేసే కాదు వంద కేసులు పెట్టినా పోరాటం ఆపబోమని, ప్రతినిత్యం ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూనే ఉంటామని అహంకార పూరిత ప్రకటనలు చేసినంత మాత్రాన అవినీతి కేసులు ఆగిపోవు. నేను ఎలాంటి తప్పూ చేయలేదు.. ఎవరికీ తలవంచేది లేదు అని ప్రజలు ఎంతోకాలం మభ్య పెట్టలేమని కెటిఆర్ గుర్తిస్తే మంచిది. ఫార్ములా ఈ రేస్‌లో ముఖ్యమంత్రి డైరెక్షన్‌లోనే ఏసీబీ విచారణ చేపట్టిందని వాదించడం ద్వారా కెటిఆర్ తన పార్టీ వాళ్లకు నమ్మకం కలిగించవచ్చు..కానీ ప్రజలకు, ఎసిబికి నమ్మకం కలిగించలేరు. ఏసీబీ కేసులో పసలేదనే విషయం కేసు పెట్టినవారికి కూడా తెలుసంటూ ఇంకా బుకాయింపులు ఎందుకో కెటిఆర్ గారు చెప్పాలి. పస ఉందా లేదా అన్నది వారు విచారణలో తేలుస్తారు. అప్పటి వరకు కొంచెం ఓపిక పట్టాలి. అవినీతి కేసులు ఒక్కొక్కటి బుసకొడుతూ బయటకు వస్తుంటాయి. సీనియర్ ఐఏఎస్ అర్వింద్‌కుమార్‌తోపాటు, హెచ్ఎండీఏ కమిషనర్ దానకిశోర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా కేటీఆర్‌ను ఎసిబి ప్రశ్నిస్తోంది. రేసు రద్దు వల్ల జరిగిన నష్టానికి ముఖ్యమంత్రి పైన కూడా కేసు నమోదు చేయాలనే వితండవాదన కూడా కెటిఆర్ తెరపైకి తెచ్చారు. రేసుల వల్ల ఇమేజ్ పెరిగితే గుర్రాలు, పత్తాల రేసులు కూడా పెట్టుకోవచ్చు. ఇక రేసులతో ఏమైనా చేయవచ్చనే మూర్ఖవాదన నుంచి కెటిఆర్ బయటపడితే మంచిది. అవినీతి ఎవరు చేసినా శిక్షార్హులే. అందుకు కెటిఆర్ కాదు..మరెవరూ అతీతం కాదని గుర్తించాలి.




# తుంగభద్ర డ్యాం ఒక అద్భుత నిర్మాణం.

**తుంగభద్ర డ్యాం, భారతదేశంలోని కర్ణాటక రాష్ట్రంలోని హొస్పేట్ జిల్లాలో ఉన్న ఒక బహుళార్థసాధక ఆనకట్ట. ఈ ఆనకట్ట తుంగభద్ర నదిపై నిర్మించబడింది. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ మరియు కర్ణాటక రాష్ట్రాల సంయుక్త ప్రయత్నంతో 1953లో పూర్తి చేయబడింది.**

**తుంగభద్ర డ్యాం యొక్క ప్రాముఖ్యత:**

**నీటిపారుదల:** ఈ డ్యాం నుండి వచ్చే నీరు ఆంధ్ర ప్రదేశ్ మరియు కర్ణాటక రాష్ట్రాల్లోని వేలాది హెక్టార్ల భూమికి సాగునీరు అందిస్తుంది.

**విద్యుత్ ఉత్పత్తి:** డ్యాం వద్ద నిర్మించబడిన జలవిద్యుత్ కేంద్రం, విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేసి రెండు రాష్ట్రాలకు సరఫరా చేస్తుంది.

**వరద నియంత్రణ:** వర్షాకాలంలో వచ్చే అధిక వరదనీటిని నిల్వ చేయడం ద్వారా, దిగువ ప్రాంతాలలో వరదలు రాకుండా ఈ డ్యాం నిరోధిస్తుంది.

**మత్స్య సంపద:** డ్యాం వద్ద ఏర్పడిన సరస్సు మత్స్య సంపదకు నిలయంగా ఉంది.

**తుంగభద్ర డ్యాం యొక్క ప్రత్యేకతలు:**

**విస్తారమైన నీటి నిల్వ:** ఈ డ్యాం భారీ మొత్తంలో నీటిని నిల్వ చేయగల సామర్థ్యం కలిగి ఉంది.

అందమైన సహజ దృశ్యాలు: డ్యాం చుట్టుపక్కల అందమైన కొండలు, గుట్టలు మరియు అడవులు ఉన్నాయి.

**పర్యాటక ప్రదేశం:** తుంగభద్ర డ్యాం ఒక ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం. ప్రతి సంవత్సరం వేలాది మంది పర్యాటకులు ఇక్కడకు వచ్చి సందర్శిస్తారు.



# నెరవేరనున్న జమ్మూకశ్మీర్ ప్రజల చిరకాల స్వప్నం

వైష్ణోదేవి ఆలయ పర్వత పాదాల కింద 3.2 కిలోమీటర్ల పొడవైన T-133సొరంగంలో నూతన రైల్వే ట్రాక్ నిర్మాణం పూర్తయింది. ఉధంపుర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వేలైనులో ఇదే చిట్టచివరి ట్రాక్. దీనివల్ల ఇకపై దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి ఢిల్లీ మీదుగా నేరుగా కశ్మీర్ కు చేరడం వీలవుతుంది. జనవరి 26న వందేభారత్ రైలు దీనిపై పరుగులు తీస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఢిల్లీ నుంచి నేరుగా కశ్మీర్ కు చేరే తొలి రైలు అదే అవుతుంది.

# పెద్దల మాట చద్దన్నం మూట సామెత బాగా పాపులర్

**పెద్దల మాట చద్దన్నం మూట సామెత బాగా పాపులర్ అయ్యింది. అదే మాదిరిగా ఒకప్పుడు సద్దన్నం కూడా బాగా ఫేమస్. ఇప్పుడైతే సిటీలో అన్నం మిగిలితే చెత్తలో పడేస్తున్నారు పల్లెలలో ఫ్రైడ్ రైస్ చేసుకొని తింటారు.**

**సద్దన్నంతో ఎన్ని లాభాలు ఉన్నాయో చూద్దాం:-**



1. టిఫిన్ అనగానే మనకు గుర్తొచ్చేది ఇడ్లీ, దోశ, చపాతి కానీ రాత్రి వండిన అన్నాన్ని తెల్లవారి ఆవకాయ, పెరుగు, కలుపుకుని పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ నంజుకుని తింటే రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం.
2. సద్దన్నం పులవడం ఒక రాత్రి ఉండడం వల్ల పెరిగే పోషకలు. ఉదాహరణకు 50 గ్రాముల అన్నంను తీసుకొని రాత్రి పుల్లపెట్టినట్లయితే1.6 మిల్లీగ్రాములు ఉన్న ఐరన్ 35 మిల్లీగ్రాములుగా పెరుగుతుంది. అలాగే పొటాషియం మరియు క్యాల్షియంలు కూడా భారీ మొత్తంలో పెరుగుతాయి.
3. రాత్రిపూట మిగిలిన అన్నంలో కొంచెం పాలు పచ్చి ఉల్లిపాయ ముక్కలు అల్లం కరివేపాకు జీలకర్ర వేసి కలిపి దానిలో కొంచెం పెరుగు వేసి పొద్దునే తింటే అనారోగ్య సమస్యలు అన్ని తొలగిపోతాయి ఎముకలకు బలం కూడా చేకూరుతుంది.
4. వేడి ఎక్కువగా ఉన్నవారు చద్దన్నంలో పెరుగు పచ్చిమిర్చి ఉల్లిపాయ వేసుకొని తింటే వేడి తగ్గుతుంది.
5. చద్దన్నం తింటే మంచిదే కదా అని మధ్యాహ్నం సాయంత్రం తిందామంటే కుదరదు. తెల్లారిన తర్వాత కూడా ఎక్కువ సమయం అలాగే ఉంచేస్తే పాడైపోయే అవకాశం ఉంది అందుకే ఉదయం 9:00 గంటల్లోపే తినేయాలి.
6. పేగుల్లో ఉండే అనారోగ్య సమస్యలకు సైతం ఈ చద్దన్నం తగ్గిస్తుంది.
7. పలు చర్మ వ్యాధుల నుండి చద్దన్నం కాపాడుతుంది.

# తొకకిసలాట బాధితులకు వైకుంఠ దర్శనం

- **కుటుంబ సభ్యలుతో కలసిపి 52మందికి దర్శన భాగ్యం**
- **సిఎం చంద్రబాబు ఆదేశాలతో చర్యలు తీసుకున్నట టిటిడి**



**తిరుమల,జనవరి10( వెలుతురు):** తిరుపతి తొక్కిసలాట బాధితులకు టిటిడి అధికారులు శ్రీవారి ప్రత్యేక దర్శనం కల్పించారు . సీఎం ఆదేశాల మేరకు క్షతగాత్రులకు టీటీడీ వైకుంఠ ద్వార దర్శనం చేయించింది. తొక్కిసలాటలో గాయపడి.. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వారందరికీ ఈ అవకాశం కల్పించారు. తొక్కిసలాట బాధితులతోపాటు వాళ్ల కుటుంబసభ్యులకు కూడా వైకుంఠ ద్వార దర్శనం చేయించింది. మొత్తం 52మందికి వైకుంఠ ద్వార ప్రత్యేక దర్శనం కల్పించారు. సీఎం చంద్రబాబు, మంత్రుల పరామర్శ సమయంలో తిరుపతి తొక్కిసలాట బాధితులు ఇదే కోరుకున్నారు. తమకు వైకుంఠ ద్వార దర్శనం చేయించి.. ఇంటికి పంపాలని విజ్ఞప్తి చేశారు. దీంతో వారికి ఆ వెసులుబాటు కల్పించారు. క్షతగాత్రులు కోరిన మేరకు మొత్తం 52మందికి టీటీడీ అధికారులు ప్రత్యేక దర్శనం చేయించారు. తిరుపతి స్విమ్స్‌లో ఇంకా 16మంది తొక్కిసలాట బాధితులకు చికిత్స కొనసాగుతోంది. క్షతగాత్రుల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు అయినట్లు తెలుస్తోంది. డిశ్చార్జ్ అయిన 33మందికి 2లక్షల రూపాయల చొప్పున పరిహారం కూడా అంజేయ నున్నారు. బాధితులను ఇంటికి చేర్చే బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకుంది. మరోవైపు తిరుపతి తొక్కిసలాటలో మరణించిన భక్తుల మృతదేహాలను వాళ్లవాళ్ల స్వస్థలాలకు తరలిస్తున్నారు. పోస్టుమార్టం తర్వాత డెడ్‌బాడీస్‌ను కుటుంబసభ్యులకు అప్పగించారు. తిరుపతి తొక్కిసలాటలో ఉమ్మడి విశాఖకి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు. నలుగురిలో లావణ్య, శాంతి, రజనీది విశాఖకాగా.. నాయుడుబాబుది నర్సీపట్నం. నలుగురి మృతదేహాలనూ.. వాళ్ల స్వగృహాలకు తరలించారు. మృతదేహాలు చూసి కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కాగా తిరుమలలో శుక్రవారం టీటీడీ పాలక మండలి అత్యవసర సమావేశం కానుంది. తొక్కిసలాట మృతుల కుటుంబాలకు పరిహారంపై తీర్మానం చేయనుంది. సాయంత్రానికి పరిహారం చెక్కులు అందించే యోచనలో ఉంది టీటీడీ బోర్డు. వైకుంఠ దర్శనాలు మూడురోజులకే పరిమితం చేయాలా.. మిగిలిన వారం రోజులకు టికెట్లు ఇవ్వాలా? అన్న అంశంపై అత్యవసర సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.

## వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొన్న కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు..



**కూకట్ పల్లి జనవరి 10 వెలుతురు:**
వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా కూకట్ పల్లి గ్రామం లోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయం, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం, వివేకానంద నగర్ కాలనీ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతుడిని వేడుకున్నట్లు తెలిపారు.

## మాదిగ విద్యార్థి యువగర్జన కరపత్రం విడుదల చేసిన అరికెపూడి గాంధీ..



**కూకట్ పల్లి జనవరి 10 వెలుతురు:**
మాదిగలకు తెలంగాణ రాష్ట్రం లో 12% రిజర్వేషన్ కల్పించాలని జిల్లాల వారిగా ఎస్సీ వర్గీకరణ చేయాలని ప్రధాన డిమాండ్ తో మాదిగ విద్యార్థి, మాదిగ సంఘాల ఐకాసా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2 తేదీన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో చేపట్టిన మాదిగ విద్యార్థి యువగర్జన బహిరంగ సభ కరపత్రాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ నివాసంలో వారి చేతులమీదుగా శుక్రవారం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డా: పిడమర్తి రవి నాయకత్వంలో విజయవంతం చేయాలని మాదిగ జాక్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు చిరుమర్తి రాజు కోరారు.

## ఎక్సైజ్ శాఖలో అవినీతి ఆరోపణలపై ప్రారంభమైన విచారణ

- ఉన్నతాధికారులతో కమిటీ వేసిన ప్రభుత్వం
- హాజరైన బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్






**అబ్కారీ భవన్,నాంపల్లి వెలుతురు:**
ఇటీవల ఎక్సైజ్ అధికారులపై బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగందర్ గౌడ్ చేసిన అవినీతి ఆరోపణలపై ఎక్సైజ్ శాఖ విచారణ కమిటీ వేసింది. శుక్రవారం జాయింట్ డైరెక్టర్ శశిధర్ రెడ్డి , అసిస్టెంట్ సెక్రెటరీ నాగలక్ష్మి నేతృత్వంలో జరిగిన విచారణకు రాచాల యుగందర్ గౌడ్ హాజరయ్యారు. హైదరాబాద్ నాంపల్లి లోని అబ్కారీ శాఖ కార్యాలయంలో కమిటీ ముందు విచారణకు హాజరైన అనంతరం రాచాల మాట్లాడుతూ... ఎక్సైజ్ కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్ సయ్యద్ ఒమర్ అలీ , వనపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ గా పని చేసిన ప్రభు వినయ్ లపై తాను చేసిన ఫిర్యాదులపై విచారణ జరిగినట్లు తెలిపారు. తాము చేసిన ఫిర్యాదులపై ఆధారాలతో సహా కమిటీకి అందజేసినట్లు వివరించారు. 20 ఏళ్లకు పైగా ఒకేచోట విధులు నిర్వహిస్తూ... ఆఫీస్ సూపరింటెండెంట్ సయ్యద్ ఒమర్ అలీ సీనియారిటీ లిస్టులో తనకు అనుకూలంగా ఉన్నవారి పేర్లను సిఫార్సు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని రాచాల ఆరోపించారు. అలాగే ఇటీవలే సస్పెండ్ అయిన వనపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రభు వినయ్ డేట్ ఆఫ్ బర్త్ ను 1964 కు బదులు 1969 మార్చుకొని ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించారని, దీనికి ఒమర్ సహకరించారని తెలిపారు. అవినీతి అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని , ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేయాలని రాచాల ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 15 న తదుపరి విచారణను హాజరు కావాలని అధికారులు కోరినట్లు రాచాల వివరించారు.

## 22వ డివిజన్ అభివృద్ధికి శ్రీకారానికి పాలకమండలి ఆమోదం





**మేడిపల్లి, వెలుతురు:-**
పీర్జాదిగూడ కార్పొరేషన్ సర్వ సభ్య సమావేశం మేయర్ అమర్ సింగ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఇందులో 32 అంశాలపై చర్చించి,35 కోట్ల రూపాయల అభివృద్ధి పఅణులకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.ఇందులో భాగంగా 22వ డివిజన్ కార్పొరేటర్ నవీన్ రెడ్డి అభ్యర్థన మేరకు డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు సుమారు కోటి రూపాయల నిధులకు పాలక మండలి ఆమోదం తెలిపింది.

ఈ సందర్భంగా కార్పొరేటర్ నవీన్ రెడ్డి...మేయర్ అమర్ సింగ్ కి,పాలక మండలి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



## ఘనంగా యువనేత దొడ్ల దొడ్ల రామకృష్ణ గౌడ్ జన్మదిన వేడుకలు...

- క్యాంపు కార్యాలయానికి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

**కూకట్ పల్లి జనవరి 10 వెలుతురు:**
ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తనయుడు యువనేత దొడ్ల దొడ్ల రామకృష్ణ గౌడ్ జన్మదిన సందర్భంగా తన కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, అభిమానులు, బంధుమిత్రుల సమక్షంలో శుక్రవారం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్లోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ఘనంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాలు అందజేసి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పిఆర్ టియు టిఎస్ శంకర్పల్లి మండల శాఖ కేలండర్ ఆవిష్కరణ



**శంకర్ పల్లి వెలుతురు జనవరి 9**
పి ఆర్ టి యూ టీ ఎస్ శంకర్పల్లి మండల శాఖ క్యాలెండర్ ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర శంకర్ పల్లి యందు ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల విద్యాదికారి అక్బర్ పిఆర్టియు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి, మండల శాఖ అధ్యక్షులు మాణిక్యం ప్రధాన కార్యదర్శి బాలరాజ్ గౌరవాధ్యక్షులు రాములు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సంజీవ రావ్, రమ , జిఎచ్ఎం అర్జున్, నరహరి, నర్సింగ్ రావు, జిల్లా నాయకులు మల్లికార్జున్, మల్లేశం రవికాంతరెడ్డి, మొగులయ్య మండల నాయకులు హరికృష్ణ శ్రీరాములు శాంతి సరిత మల్లేశం ఆనందం విశ్వనాథ్ శ్రీధరరెడ్డి సరిత స్వప్న ప్రియ , ఉపాధ్యాయులు ఉమామహేశ్వర్ ఆనందం పెంటయ్య మల్లికార్జున్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

KOMPALLY

SURAKSHA
Women & Children Hospital
GENERAL PEDIATRICS | OBSTETRICS & GYNAECOLOGY | PEDIATRIC LAPAROSCOPIC SURGERIES
LEVEL III NICU & PICU | PEDIATRICS INTENSIVE CARE UNIT | NEONATAL INTENSIVE CARE UNIT
CRITICAL CARE OBSTETRICS & GYNAECOLOGY | 24/7 LABORATORY & PHARMACY | 24/7 AMBULANCE
FOR APPOINTMENTS
040 2666 6666, 888 666 8026

Suraksha
Super Speciality Hospital
24/7 CRITICAL CARE TEAM | 24/7 CT SCAN | DIALYSIS | 24/7 LABORATORY & PHARMACY
24/7 AMBULANCE | 100 BEDDED CAPACITY | FULLY EQUIPPED OPERATION THEATRES
30 BEDDED MICU & SICU | DELUXE, SEMI DELUXE, A/C WARDS
FOR APPOINTMENTS
040 26 108 108, 7240 108 108

# యువత దేశ పురోగతికి పాటు పడాలి

- ఘనంగా రెడ్డి ఉమెన్స్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే
- ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఉన్నత విద్య మండలి చైర్మన్ బాల కిష్టరెడ్డి






**వెలుతురు, సిటీ కల్చరల్ :** ఉన్నత చదువులు చదివిన వారు దేశ పురోగతికి పాటు పడాలని తె లంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామం డలి చైర్మన్ ప్రొ.వి.బాలకిష్టరెడ్డి అన్నారు. నారాయణగుడలోని రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల 13వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శుక్రవారం ఘ నంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బాలకిష్టరెడ్డి విద్యార్థులకు పట్టాలు అందజేసి ప్రసంగించారు. ప్రపం చంలోని అతిపెద్ద వ్యాపారసంస్థల్లో ఉన్నత స్థాయిలో పని చేసే వారిలో భారతీయులు అధికంగా ఉండటం అభినందనీయమన్నారు. విద్యారం గంలో చోటుచేసుకున్న విప్లవాత్మక మైన మార్పుల కారణంగా నేడు చా లామంది ఉన్నత చదువులు చదివి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించేస్థా యికి చేరుకున్నారన్నారు. ఆడపిల్ల లు సమాజంలో మరింత ఉన్నత శి ఖరాలను అధిరోహించాలని, తమ కు వచ్చిన ప్రతి అవకాశాన్ని అంది పుచ్చుకోని నవ భారత నిర్మాణంలో తమదైన శైలిలో ఎన్నో అంశాల మీ ద వారి ఏకాగ్రత కేంద్రీకరించి బంగా రు తెలంగాణను సాధించడానికి దో హదపడాలని అన్నారు. విద్యార్థిని లు అందరూ వారి వారి రంగాలలో ఉన్నత శిఖరాలను చేరుకోని, వారి తల్లిదండ్రులు చేసిన కృషిని ఎల్ల ప్పుడూ గుర్తుంచుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొ.శ శికాంత్, సె క్రటరీ రెడ్డీ ఉమెన్స్ కళాశాల సు దర్శన్ రెడ్డి, ప్రిన్సిపాల్ అచ్యుత దేవి, కళాశాల సెక్రటరీ కమ్ కర స్పాండెంట్ ప్రొ.జి.సుదర్శన్ రెడ్డి,వైస్ ప్రిన్సిపల్ కె. సింధూరి, డాక్టర్ సుచిత్ర, కె. స్వప్న, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో శంకర్ పల్లిని ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలి

- శంకర్ పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

**శంకర్ పల్లి వెలుతురు జనవరి 10**

రాష్ట్రంలో శంకర్ పల్లిని ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని శంకర్ పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కోరారు. శుక్రవారం రోజున శంకర్ పల్లి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందితో సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో పట్టణ పరిధిలో ఇంటి పన్నులు 100 శాతం వసూలు చెయ్యాలని బిల్ కల్లెక్టర్లకు సూచనలు జారి చేయడం జరిగినది. ప్రజలు కూడా సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ పారిశుద్ధ్య నిర్వహణకు మరియు పట్టణ అభివృద్ధికి సహకరించగలరని మున్సిపల్





కమీషనర్ శ్రీనివాస్ తెలియజేశారు. తదుపరి ప్రభుత్వ ఆదేశానుసారం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వెరిఫికేషన్ కొరకు మార్చ్ 31 చివరి తేది గా నిర్ణయించ బడినది.కావున పట్టణ ప్రజలు పట్టణ పరిధిలో గల స్థలములకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న వారు ఇట్టి అవకాశం సద్వినియోగం చేసుకోనవలసినదిగా తెలిపినారు. మార్చ్ 31 చివరి తేది తదుపరి ప్రజలపై అధిక భారం పడే అవకాశం ఉన్నందున త్వరితగతిన ఎల్ఆర్ఎస్ వెరిఫికేషన్ చేయించుకొని ఎల్ఆర్ఎస్ ఆమోదం పొందగలరని స్థానిక ప్రజలకు తెలిపినారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వి.అంజన్ కుమార్, వార్డు ఆఫీసుర్లు, బిల్ కలెక్టర్లు మరియు తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొనడం జరిగినది.

## ఇక్ఫాయ్ క్యాంపస్ లో తృష్ణా 2కె25 వార్షిక నిర్వహణ,

# సాంస్కృతిక ఉత్సవ కార్యక్రమాలు






**శంకర్ పల్లి వెలుతురు జనవరి 10**

ఐ బి ఎస్ క్యాంపస్ దొంతాన్ పల్లి ప్రతిష్టాత్మక వార్షిక నిర్వహణ మరియు సాంస్కృతిక ఉత్సవం అయిన తృష్ణా 2కె25 ను జనవరి 10 నుండి 12 2025 వరకు విజయవంతంగా నిర్వహిస్తోంది. "అరౌండ్ ది గ్లోబ్, వసుధైవ కుటుంబకం" అనే ఇతివృత్తంతో, మూడు రోజుల కార్యక్రమం భారతదేశం నలుమూలల నుండి విద్యార్థులను ఒకచోట చేర్చి, విద్యా అభ్యాసం, పోటీ స్ఫూర్తి ,సాంస్కృతిక వేడుకల సుసంపన్నమైన కలయికను అందిస్తుంది. తృష్ణా 2కె25 నిర్వహణ , సంస్కృతి యొక్క వివిధ అంశాలను కలిగి ఉన్న 45 డైనమిక్ ఈవెంట్ల యొక్క విభిన్న శ్రేణిని కలిగి ఉంది. ఈ కార్యక్రమాలు సృజనాత్మకత, వ్యూహాత్మక ఆలోచన మరియు జట్టు సహకారాన్ని పెంపొందించేటప్పుడు వాస్తవ-ప్రపంచ వ్యాపార పరిస్థితులతో నిమగ్నం కావడానికి పాల్గొనేవారిని సవాలు చేస్తాయి. కేస్ స్టడీ సవాళ్లు, క్విజ్లు, క్రీడలు మరియు సాంస్కృతిక ప్రదర్శనలు వంటి కార్యకలాపాలు అధిక శక్తి స్థాయిలను నిర్వహిస్తాయి. హాజరైన వారందరికీ సంతృప్తికరమైన,ఆకర్షణీయమైన అనుభవాన్ని నిర్ధారిస్తాయి. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ సంస్థలకు చెందిన ప్రముఖ నిపుణులు ప్రారంభించారు. వి. కుమార్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఒసిఎల్) నుండి ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్ర హెచ్ ఆర్ హెడ్ వి. పల్లం రాజు, రీజినల్ మేనేజర్, వికారాబాద్ రీజియన్, ఎఒ సికింద్రాబాద్-స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బిఐ) సంఘర్ష్ కేసర్, డైరెక్టర్, యుఎస్ ట్రాన్స్ఫర్ ఏజెన్సీ %ఒ% సబ్ అకౌంటింగ్ ఆపరేషన్స్, బిఎన్వై (బ్యాంక్ ఆఫ్ న్యూయార్క్), లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి). కుమార్ తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అన్ని కార్యక్రమాలకు విద్యార్థులను ప్రేరేపించే కార్పొరేషన్ల ప్రాముఖ్యతను ఎత్తిచూపారు. ఈ అనుభవాలు విద్యార్థి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో చాలా విలువను జోడిస్తాయని పంచుకున్నారు. ఐఒసిఎల్తో నిరంతరం సంభాషిస్తున్నందుకు నిర్వాహక బృందం చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. పల్లం రాజు, విభిన్న పరిస్థితులను ఎలా నిర్వహించవచ్చో, ఆధునిక ఆలోచనలతో సంస్కృతిని ఎలా అవలంబించవచ్చో అన్ని వర్గాల కస్టమర్లను చేర్చడానికి ఎస్బిఐ తన మార్కెటింగ్ను ఎలా పునర్నిర్మించిందో ప్రేక్షకులకు చెప్పారు. సంఘర్ష్ కేసర్ కూడా తన అనుభవాలను, మరియు నిరంతరం నేర్చుకోవడం జీవిత ప్రయోజనం యొక్క ఔచిత్యాన్ని పంచుకున్నారు. బి. ఎన్. వై. తో తమ వృత్తిని ప్రారంభించే విద్యార్థులందరికీ స్వాగతం పలికే అవకాశాన్ని కూడా ఆయన సద్వినియోగం చేసుకున్నారు.

శ్రీమతి. ఐసిఎఫ్ఎఐ సొసైటీ చైర్పర్సన్ శోభా రాణి యశస్వీ ఈ కార్యక్రమానికి హాజరై, నిర్వాహక బృందం చేసిన కృషిని ప్రశంసించారు. ఐబిఎస్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ కె ఎస్ వేణుగోపాల్ ఈ కార్యక్రమంలో అమూల్యమైన మార్గదర్శకత్వం అందించి, విద్యార్థులను వారి ప్రయత్నాలలో రాణించమని ప్రోత్సహించారు. విద్యార్థి కార్యకలాపాల సమన్వయకర్త అసోసియేట్ ప్రొఫెసర్ మాధవి గారికపర్థి, ఏదైనా కార్యక్రమాన్ని నిర్వహించడానికి అన్ని విద్యార్థి సంఘాలు ఎలా సజీవంగా ఉంటాయో ప్రేక్షకులతో పంచుకున్నారు. ప్రొఫెసర్, మాధవి తృష్ణా 2కె25 విజయంలో కీలక పాత్ర పోషించారు. వారి ఉత్తమ ప్రదర్శనను అందించడానికి బృందాన్ని ప్రేరేపించారు. ఈవెంట్ యొక్క అతుకులు లేని అమలును నిర్ధారించారు. నిర్వహణ యొక్క నిరంతర మద్దతు, తృష్ణా కోర్ కమిటీ, వాలంటీర్లు, స్టూడెంట్స్ క్లబ్బులు, క్రమశిక్షణా కమిటీ, సహాయక సిబ్బంది మరియు పరిపాలన యొక్క అసాధారణమైన కృషి ద్వారా తృష్ణా 2%ఖ%25 విజయం సాధ్యమవుతుంది. కోర్ కమిటీ యొక్క ఖచ్చితమైన ప్రణాళిక మరియు అమలు ఈవెంట్ను విశేషమైన అనుభవంగా మారుస్తున్నాయి. వారి నాయకత్వం సంస్థాగత నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నాయి. వారి దర్శకత్వంలో, తృష్ణా 2కె25 కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా సృజనాత్మకత మరియు శ్రేష్టతకు వేడుకగా మారుతోంది. తృష్ణా 2కె25 విజయం స్పాన్సర్ల మద్దతు లభించింది - టైటిల్ స్పాన్సర్-ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఒసిఎల్) ఐఒసిఎల్ అంతటా మద్దతును అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది యువ ప్రతిభావంతుల ఆవిష్కరణ ప్రోత్సాహానికి వారి నిబద్ధత విద్యార్థులందరికీ ప్రేరణగా పనిచేస్తోంది.
అసోసియేట్ స్పాన్సర్లు-స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బిఐ) బ్యాంక్ ఆఫ్ న్యూయార్క్ (బిఎన్వై) మరియు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) తమ అచంచలమైన మద్దతుతో ఈ ఉత్సవాన్ని శక్తివంతం చేస్తున్నాయి. త్రిష్ణ 2కె25 కొత్త మైలురాళ్లను సాధించడంలో సహాయపడుతున్నాయి.
నిర్వాహక కమిటీ స్పాన్సర్లందరి సహకారానికి ఈవెంట్ను సుసంపన్నం చేసినందుకు, దీన్ని నిజంగా మరపురానిదిగా చేసినందుకు కృతజ్ఞతలు తెలిపింది. ఇతర భాగస్వాములు- క్లౌడ్ 9, ప్రిజ్మో, చార్మినార్ బిరియానీ, ఎలిసియం, బిగ్ స్టార్, మిస్టర్. బబుల్, డొమినోస్, కానికల్ గ్రాఫిక్స్, ఫాసోస్, వెండీస్ మరియు లస్సీ హబ్ల సహకారం ఈ కార్యక్రమానికి చైతన్యాన్ని , రుచిని జోడిస్తున్నాయి. తృష్ణా 2కె25 విజయంతో, ఐబిఎస్ హైదరాబాద్ సమాజం రాబోయే సంవత్సరంలో మరింత గొప్ప ఎడిషన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.
ఇక్ఫాయ్ యాంటీ నార్కోటిక్స్ సెల్, నిరామయ తారంగ్ను తృష్ణా మేనేజ్మెంట్ ఫెస్ట్ సందర్భంగా ప్రారంభించారు.ఐసిఎఫ్ఎఐ సొసైటీ చైర్పర్సన్ శ్రీమతి శోభా రాణి యశస్వీ, డాక్టర్ ఎస్. విజయలక్ష్మి (రిజిస్ట్రార్, ఐఎఫ్హెచ్ఈ) డాక్టర్ వేణుగోపాల (డైరెక్టర్, ఐబిఎస్ హైదరాబాద్) శ్రీ ఎస్. పి. విశ్వనాథ్, డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్ చొరవకు నాయకత్వం వహించారు.


# స్విమ్మింగ్ పూల్ లో మునిగి బాలుడు మృతి

- వైల్డ్ వాటర్ అలలతో ఆడుకుంటూ నీట మునిగిన బాలుడు
- తోటి విద్యార్థులతో కలిసి పాము ఎక్సో టీకా కు విహారయాత్ర
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

**శంకర్పల్లి వెలుతురు జనవరి 9**



తోటి విద్యార్థులతో కలిసి విహారయాత్రకు వచ్చిన ఓ విద్యార్థి స్విమ్మింగ్ పూల్లో ఆడుకుంటూ నీట మునిగి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన శంకరపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. హైదరాబాద్ పాతబస్తీలోనే శాలిబండకు చెందిన రఫియా గులాం రసూల్ అన్సారీల కుమారుడు ఫైజాన్ అన్సారి జాన్ ఖూమాలోని మదీనా మిషన్ హై స్కూల్లో ఆరో తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాల ఉపాధ్యాయులు 60 మంది విద్యార్థులతో కలిసి శంకర్పల్లి మండల పరివేద గ్రామ శివారులోని ఫామ్ఎక్సోటికా వైల్డ్ వాటర్ కు విహారయాత్రకు వచ్చారు. పిల్లలు ఆడుకుంటున్న సమయంలో స్కూలుకు సంబంధించిన ఎవరు కూడా వాళ్లతో పాటు ఉండకపోవడం మరియు రిసార్ట్స్ యాజమాన్యం కనీస భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్ల వైల్డ్ వాటర్ లోని అలలతో కూడిన స్విమ్మింగ్ పూల్ లో ఆడుకుంటూ ఉండగా నీట మునిగాడు. ఈ ఘటనతో విద్యార్థి స్విమ్మింగ్ పూల్ లోనే స్పృహ తప్పి పడిపోయాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో విద్యార్థి చనిపోయాడు. అయితే మృతుడి తండ్రి గులాం రసూల్ అన్సారి యొక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శంకరపల్లి సిఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.




## తొర్రూర్ రంగనాయకుల స్వామి ఆలయంలో పూజలు చేసిన సిఐ నాగరాజు గౌడ్



**వెలుతురు, హయత్ నగర్, జనవరి 10:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లా పూర్ మెట్ మండల పరిధిలోని తొర్రూరు గ్రామంలో గల రంగనాయక స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా హయత్ నగర్ పోలీస్ స్టేషన్ సి ఐ పల్స నాగ రాజు గౌడ్ ప్రత్యక పూజలు నిర్వహించారు,ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు, అనంతరం సి ఐ నాగరాజు గౌడ్ మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు, అలాగే దేవాలయాల్లో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకోవడం ద్వారా మనశ్శాంతిగా ఉంటామన్నారు, ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఆశించినట్టుగా అందని సీఎంఆర్ఎఫ్ చెక్కులు

- సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి



**వెలుతురు, ఎల్ బి నగర్, జనవరి 10:** మహేశ్వరం నియోజకవర్గం లోని మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్ర వారం బడంగ్ పేట్ , మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లు, తుక్కుగూడ, జలపల్లి మున్సిపాలిటీలలో , ఆర్కేపురం, సరూర్ నగర్ డివిజన్లో నివాసముండే అర్హులైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలు అప్పులు చేసి వైద్య నిమిత్తం ఖర్చులు చేస్తే ముఖ్యమంత్రి సహాయనిధికి అర్జీ పెట్టుకోగా వారి అర్జీలను సకాలంలో చెల్లించడం లేదని కానీ ఇప్పుడున్న ప్రభుత్వం ఆశించినట్టుగా వారికి చెక్కులు అందించడం లేదన్నారు , అంతేకాకుండా వారికి ఇస్తున్న రిలీఫ్ ఫండ్ ఏ పద్ధతి ప్రకారం గా ఇస్తున్నారని సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు తెలిపారు,నిరుపేదలు చాలా ఇబ్బంది పడుతున్నారని ఇప్పటికైనా మార్పు తీసుకొచ్చి వారికి సరైన పద్ధతిలో చెక్కులు అందజేయాలని సబితా ఇంద్రా రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, అధికారులు , తదితరులు పాల్గొన్నారు,

# బీసీ పోలీస్ అధికారులకు ప్రాధాన్యత గల పోస్టుల్లో అవకాశం కల్పించాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి లేఖ రాసిన బీసీ నేత జాజుల లింగం గౌడ్



**హైదరాబాద్ వెలుతురు జనవరి 10:**
బీసీ పోలీస్ అధికారులకు ఎస్సై స్థాయి నుండి ఐపీఎస్ స్థాయి వరకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వారికి ప్రాదాన్యత గల పోస్టుల్లో అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి లేఖ రాసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు.ఈ సందర్బంగా లింగంగౌడ్ మాట్లాడుతూ అన్ని అర్హతలు, సిన్సియారిటీ సీనియారిటీ ఉన్న పదోన్నతులు పోస్టింగ్ విషయాలలో బీసీ పోలీస్ అధికారులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కేవలం లాబీయింగ్ చేసే వారికి రాజకీయ పలుకుబడి ఉన్న కొంతమంది రెండు కులాలకు మాత్రమే ప్రాధాన్యతను ఇస్తున్నారు. మెజార్టీగా ఉన్న బీసీలకు ఈ విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని,ఎంతో ప్రతిభ ఉన్న బీసీ పోలీస్ అధికారులకు లూప్ లైన్లో లేదా విఆర్ లో ఉంచుతున్నారని దయచేసి వారికి ప్రాదనతగల పోస్టులో అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బూర శ్రీనివాస్ గౌడ్ మరియు గోదా రవి తదితరులు పాల్గొన్నారు.

# సామాన్య ప్రజల గొంతుక ప్రజా సంగ్రామం

- ఎడిటర్ ప్రసాద్ సగారపును అభినందించిన మాజీ మంత్రి ఆర్ డిఆర్



**హైదరాబాద్ వెలుతురు జనవరి 10:**
సామాన్య ప్రజల గొంతుక ప్రజాసేన గ్రామం దినపత్రిక అని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాదులోని పార్టీ ఆర్ డిఆర్ నివాసంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణా రెడ్డి, ఎడిటర్ సగరపుతో కలిసి 2025 ప్రజా సంగ్రామం దినపత్రిక క్యాలండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య ప్రజా సంగ్రామం వారిదిగా ఉండి ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళుతుంది అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు మరిన్ని సేవలు అందించి ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. పత్రికారంగంతో పాటు న్యాయవాదిగా, విద్యార్థి నాయకుడిగా నిత్యం ప్రజాసేవలో ఉంటున్న ప్రజా సంగ్రామం దినపత్రిక ఎడిటర్ ప్రసాద్ సగరపును అభినందించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ప్రతినిధి గుగులోతు వీరన్న నాయక్ ఉన్నారు.

# ఆశా వర్కర్లకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం సబితా ఇంద్రారెడ్డి

- కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవట్లేదని ఆశా వర్కర్ల ఆవేదన
- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసిన ఆశ వర్కర్లు



**వెలుతురు, ఎల్ బి నగర్, జనవరి 10:**
మహేశ్వరం నియోజకవర్గం లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ని ఆశ వర్కర్లు శుక్ర వారం మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని ముఖ్యంగా ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని మా పక్షాన అసెంబ్లీలో మా సమస్యల పైన చర్చించాలని కోరినట్లుగా సబితా ఇంద్రారెడ్డి తెలిపారు,మీ పక్షాన పోరాడుతున్నామని అసెంబ్లీలో మళ్లీ ఖచ్చితంగా మా గొంతు లేవనెత్తుతామని ఆశ వర్కర్లకు ఆమె హామీ ఇచ్చారు,మీకు న్యాయం జరిగేంతవరకు కచ్చితంగా మీకు అండగా ఉంటామని సబితా ఇంద్రా రెడ్డిబరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు మరియు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు,

# కబ్జా దారులనుండి మాసబ్ చెరువును కాపాడండి

- మాసబ్ చెరువు పరిరక్షణ కమిటీ తుర్కయంజాల్



**తుర్కయంజాల్ వెలుతురు జనవరి 10:**
మాసబ్ చెరువు పరిరక్షణ సమితి శుక్రవారం రోజున మాసబ్ చెరువును సందర్శించడం జరిగింది ఈనెల 8వ తేదీన హైడ్రా కమీషనర్ శ్రీ రంగరాజన్ గారు మిగతా అధికారులు చెరువును సందర్శించిన విషయం విధితమే. గత రెండు సంవత్సరాల క్రితం అనేకమైన వర్షపాతం వల్ల చెరువు పూర్తి గా నిండిన సమయంలో 205 సర్వే నెంబర్లు యజమానులు చెరువులో మట్టిని పోసి పూడ్చిన సందర్భంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ చెందిన అనేక పార్టీల నాయకులు ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని మాసబ్ చెరువు పరిరక్షణ సమితి గా ఏర్పడి దరిదాపు మూడు నెలలు రాత్రిబవళ్ళు ఉద్యమాలు చేసి చివరాఖరుకు హైకోర్టును ఆశ్రయించి అట్టి పనులు ఆపడం జరిగింది. కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న అన్ని చెరువులు కబ్జా గురవుతున్నట్టు గుర్తించి దాని మీద ఒక కమీషన్ ఏర్పాటు చేసి కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేవిధంగా పనిచేస్తుంది. అది మాకు చాలా సంతోషంగా అనిపించి మేము అనగా మాసబ్ చెరువు పరిరక్షణ సమితి గత సంవత్సరం ఏ2.09 2024ఏ నాడు హైడ్రా కమిషనర్ రంగనాథ్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అలాగే వినాయచవితి సందర్బంగా వేసిన విగ్రహాల కు సంబంధించిన ముడి పదార్థాలా చెత్తను తీసివేయమని గత రెండు సంవత్సరాల నుండి స్థానిక కమీష్నర్లబకు ఎన్ని సార్లు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదు. కానీ ఈ మధ్య మాసబ్ చెరువును సందర్శించిన రంగనాద్ గారు మరియు వారి సహచర అధికారులు మా కమిటీ సభ్యులకు ఎవరికీ కూడా సమాచారం ఇవ్వకుండా చెరువును సందర్శించడం జరిగింది. కమిషన్ పట్ల మాకు పూర్తి విశ్వాసం ఉంది చెరువును కబ్జాదారులనుండి రక్షిస్తారని ఇదే విషయమై రేపు స్థానిక శాసన సభ్యులు శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి గారిని మరొక్కసారి హైడ్రా కమీషనర్ రంగరాజన్ గారిని కలవడానికి మాసబ్ చెరువు పరిరక్షణ కమిటీ సిద్ధంగా ఉందని తెలియజేస్తున్నాం.ఈ కార్యక్రమం లో మాసబ్ చెరువు పరిరక్షణ కమిటీ అధ్యక్షులు బచ్చిగళ్ళ రమేష్ రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్ గారుకోశిక ఐలయ్య కొంతం యాదిరెడ్డి కళ్యాణ్ నాయక్ బొక్క వంశీధర్ రెడ్డి అరుణ్ కుమార్ గుత్త మహేందర్ రెడ్డి వీరేశం తదితరులు పాల్గొన్నారు.

# అండర్ -19 యువకులకు క్రికెట్ బ్యాట్, బాల్, వికెట్ కిట్ లను బహుకరించిన మాజీ ఉప సర్పంచ్ జరుప్ల విజయ్ కుమార్ నాయక్




**యాచారం వెలుతురు జనవరి 10:**
ఆల్మైటీ ఫౌండేషన్ అధ్యక్షులు ఆంగోత్ వెంకటేష్ సహకారంతో, తక్కళ్లపల్లి తండా మాజీ ఉప సర్పంచ్ జరుప్ల విజయ్ కుమార్ నాయక్ ముఖ్యఅతిధిగా శుక్రవారం రోజున అండర్ -19 యువకులకు క్రికెట్ బ్యాట్, బాల్, వికెట్ కిట్ లను బహుకరించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో రమావత్ సుధాకర్, రమావత్ నరేందర్, సభావత్ రాజేష్, రమావత్ రిమాజీ, సబావత్ సురేష్, రమావత్ శంకర్ మరియు తదితరులు పాల్గొన్నారు

# అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠా సభ్యుల అరెస్టు





**వెలుతురు, హైదరాబాద్, జనవరి 10:**
రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంకు భారీగా అక్రమంగా గంజాయి తరలిస్తున్న 8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు, ఈ కేసుకు సంబంధించిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి అక్రమంగా హైదరాబాద్ నగరానికి రవాణా చేస్తున్న ముఠాను హయత్ నగర్ పోలీసులు, ఎస్ ఓ టి బృందం సంయుక్తంగా పట్టుకున్నారని 8 మందిని అరెస్ట్ చేసి వీరి నుంచి నాలుగున్నర కిలోల గంజాయి , మూడు బైకులు,6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు,
ఒడిసా నుంచి గంజాయిని తరలిస్తు న్నట్లుగా ఇక్కడ అధిక ధరకు గంజాయిని అమ్మకాలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు, అయితే గంజాయి రవాణా లో పట్టుబడిన వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి,



# కొమ్మాయిగూడెం గౌడ విద్యార్థికి పూణేలో డాక్టరేట్.

**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 10**
వీరమళ్ళ లింగస్వామి గౌడ్, తండ్రి.శివయ్య యం.ఎస్సీ పిఎస్ డీ.అనాటమి.మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామం గౌడ కులానికి చెందిన వీరమళ్ళ.లింగస్వామి పేదరికం నుండి వచ్చాడని చిన్నప్పటి నుండి తల్లి కష్టపడి చదివించిందని, తన తల్లి కష్టానికి తగు ఫలితంగా చదివి ఈరోజు అనాటమీలో "మోకాలి కీలు" దానిలో ఉన్నటువంటి వివిధ లిగమెంట్స్ మెనిస్కస్ లపై చేసినటువంటి పరిశోధనలకు గాను డా:డి.వై పాటిల్ విద్యాపీట్ యూనివర్శిటీ పూణే , మహారాష్ట్ర వారు గౌరవ డాక్టరేట్ ను అందచేశారు.వారు ప్రాథమిక విద్యను కొమ్మాయిగూడెంలో, హైస్కూల్ విద్యాభ్యాసము ను ప్రభుత్వ జూనియర్ కళాశాల రామన్నపేటలో, డిగ్రీ విద్యను నాగార్జున ప్రభుత్వ కళాశాల నల్గొండ లో , పీజీ విద్యను కామినేని మెడికల్ కాలేజీ నార్కట్ పల్లి లో పూర్తి చేసారు..PHD ని డా:డి.వై పాటిల్ విద్యాపీఠ్ లో పూణేలో చేసారు....ప్రస్తుతం నీలిమ మెడికల్ కాలేజీ హైదరాబాద్ లో ప్రొఫెసర్ గా యం.బి.బి.ఎస్ విద్యార్థులకు మెడికల్ అనాటమీ భోధించుచున్నారు. వీరమల్ల లింగస్వామి తన ప్రత్యేకత ఏమిటి అంటే తన గ్రామంలో ఉన్నటువంటి హైస్కూల్ కు టెన్త్ క్లాస్ బ్యాచ్లకు 2009 సంవత్సరం నుండి మొదటి బహుమతికి 5016, రెండో బహుమతికి 3016 ప్రతి సంవత్సరం ఇవ్వడం జరుగుతుంది.

# రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్ ను కలిసిన మాజీ సర్పంచ్ నరేష్ నాయక్



**వెలుతురు, చారకొండ 11, జనవరి:**
ఇటీవల ప్రభుత్వం చారకొండ మండల కేంద్రానికి చెందిన చారకొండ వెంకటేష్ నురాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడుగా నియమించింది. శుక్రవారం హైదరాబాద్ లో చారకొండ వెంకటేష్ ను మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు ఆంగోత్ నరేష్ నాయక్ మర్యాద పూర్వకం గా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చారకొండ మండలానికి విద్యారంగంలో అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# దేవలమ్మ నాగారం లోని మహా విష్ణువు ఆలయం ను సందర్శించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**వెలుతురు, యాదాద్రి భువనగిరి, జనవరి 10:**
ప్రజలందరు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని ఆ ఆదిమహావిష్ణువుని ప్రార్థిస్తున్నా అని మునుగోడు నియోజకవర్గం ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.మునుగోడు నియోజకవర్గం, చౌటుప్పల్ మండలం దేవులమ్మ నాగారంలో శుక్ర వారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శ్రీ మహాలక్ష్మి సమేత శ్రీ ఆది మహావిష్ణువును ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కుటుంబ సమేతంగా ఉత్తర



ద్వారం ద్వారా దర్శించుకున్నారు, ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలను వారిచే నిర్వహించారు,స్వామి వారి దర్శనం అనంతరం కళ్యాణ మండపంలో నిర్వహించిన స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో పాటు ప్రజలు వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మహా విష్ణువు స్వామి అనుగ్రహం తో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు , తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందని అన్నారు,

## TUTF డైరీ, క్యాలండర్ MPDO చే ఆవిష్కరణ



**రామన్నపేట వెలుతురు జనవరి 10**

శుక్రవారం రోజు తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (TUTF ) డైరీ, క్యాలండర్ - 2025 ను రామన్నపేట MPDO . యాకూబ్ నాయక్ , MEO .K. శ్రీనివాస్ రెడ్డి చే ఆవిష్కరింప జేయడం జరిగింది. TUTF యాదాద్రి జిల్లా ప్రదాన కార్యదర్శి ఉయ్యాల బిక్షమయ్య, మండల అధ్యక్షులు పాల్వంచ హరికిషన్. ఈ సందర్బంగా మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం ఏర్పడిన TUTF నాయకులు ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేయడం జరిగిందని, ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతరం పనిచేస్తున్నామని, శాస్త్రీయ విద్యా విధానం కోసం, పాఠశాలల పటిష్టత కోసం TUTF పనిచేస్తుందని గుర్తు చేశారు. ప్రభుత్వం PRC నివేదికను తెప్పించుకొని తక్షణమే 50%ఫిట్మెంట్ ను ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న 4 DA లను విడుదల చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని, 317 GO భాధితులకు తమ స్వంత జిల్లాలకు బదిలీ చేయాలని, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ ను ఉద్యోగ విరమణ చేసిన రోజే అందచేయాలనీ , ఉద్యోగుల GPF పార్ట్ ఫైనల్, TSGLI సరిండర్ లీవ్ ల మెడికల్ బిల్లుల నగదు ను వెంటనే మంజూరు చేయాలని, SSC విద్యార్థులకు ప్రత్యేక క్లాసులకు హాజరయ్యే వారికీ ఆల్పాహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమం ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి, రఘురాంరెడ్డి, పరుషరాములు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వెంకట్ రెడ్డి ని కలిసిన మైనారిటీ నాయకుడు రహీమ్ షరీఫ్



**వెలుతురు, హైదరాబాద్, జనవరి 10:**

హైదరాబాద్ లో రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి నీ శుక్ర వారం నాడు రాష్ట్ర మైనారిటీ నాయకుడు రహీమ్ షరీఫ్ మర్యాద పూర్వకంగా కలిశారు, ఈ సందర్భంగా మంత్రి వెంకట్ రెడ్డి కి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న బడుగు బలహీన వర్గాలకు చెందిన వారికి అండగా ఉండాలని షరీఫ్ మంత్రి ని అభ్యర్థించారు, అలాగే మునుగోడు నియోజకవర్గంలో రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని మంత్రి వెంకట్ రెడ్డి ని కోరారు, అదేవిధంగా మునుగోడు నియోజకవర్గంలో మైనారిటీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా షరీఫ్ మంత్రి వెంకట్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చుననీ రహీమ్ షరీఫ్ తెలిపారు,

## రాచకొండ శ్రీ లక్ష్మి నరసింహస్వామి క్షేత్రంలో వైభవంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి 10:**

సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండ పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా లక్ష్మి నరసింహస్వామి ఉత్సవ విగ్రహాలు ఉత్తర ద్వారా దర్శనం ఇవ్వడం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి అభిషేకాలు పూజలు నిర్వహించారు. రాచప్ప కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో రాజప్ప సమితి అధ్యక్షులు బద్దుల కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి సూరపల్లి వెంకటేష్, కడారు అంజిరెడ్డి, రవీందర్ రెడ్డి ,కొండ శీను ,పేరా రమేష్, చిలువేరు శంకర్ ,ఆలయ పూజారి లక్ష్మణాచారి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాల్కల్ మండల బీజేపీ అధ్యక్షులుగా ఎన్నికైన మల్లేష్ గంగ్వార్....

**జహీరాబాద్ వెలుతురు జనవరి 10:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా గంగ్వార్ గ్రామానికి చెందిన మల్లేష్ గంగ్వార్ ని ఎన్నుకున్నట్లు సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలియచేశారు. ఈ సందర్బంగా మల్లేష్ గంగ్వార్ మాట్లాడుతూ నా పై నమ్మకం ఉంచి అప్పచేప్పిన భాధ్యతను పార్టీ నియమ నిబంధనలకు లోబడి పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మండలంలోని నాయకులతో, కార్యకర్తలతో కలిసి పని చేస్తా అన్నారు. అలాగే నన్ను మండల అధ్యక్షులుగా నియమించిన సంగారెడ్డి జిల్లా రథసారథి గోదావరి అంజిరెడ్డి కు అలాగే సహకరించిన జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు గొల్ల భాస్కర్, మల్లికార్జున్ పాటీల్, సుభాష్ రెడ్డి, ఓంకార్ యాదవ్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# నారాయణపురం మండల కేంద్రంలో అభయ ఫౌండేషన్ ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం





**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి 10:** యాదాద్రి భువనగిరి జిల్లాలో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రంలో ఆర్థికంగా వెనుకబడిన సుమారు 40 మంది గ్రామీణ మహిళల సాధికారత కోసం 90 రోజుల ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. రెగల్ రెస్నర్డ్ వారి సి.ఎస్.ఆర్ నిధులతో ఉచితంగా టూల్ కిట్స్,కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మహిళలందరూ ఈ అవకాశాన్ని శ్రద్ధగా, గైర్హాజరు కాకుండా వచ్చి నేర్చుకోవాలి అని చెప్పారు. అక్కడి మహిళలతో మాట్లాడిన స్వామీజీ వారి స్థితి గతులు చూసి చలించి పోయి, కల్పించిన సేవా కేంద్రం ద్వారా మహిళలు ఉపాధి శిక్షణ పొందాలని చెప్పారు. అభయ అనందనిలయం, ఇబ్రహింపట్నం గ్రామం లో గ్రామీణ యువతకు ఉచిత వసతి భోజన సదుపాయం కల్పించి చదువు కోని, ఉద్యోగం లేని వారికి ఉపాధి శిక్షణ కల్పిస్తుందన్నారు. ఈ కార్య క్రమంలో అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలచంద్ర స్వామిజి, కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగస్వామి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బాల కృష్ణ, కేంద్ర సంచాలకులు లావణ్య, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొన్న 1995 -96 స్నేహ యూత్

- **యువత సన్మార్గంలో పయాణించడాని క్రీడా పోటీలు ఉపయోగపడతాయి.**



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి 10 :** 1995 - 96 ఎస్.ఎస్.సి బ్యాచ్ స్నేహ యూత్ మిత్రులు సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఎస్.ఎన్. పి.ఎల్ 4 లో పాల్గొన్నారు. మానసిక ఉల్లాసానికి ఆరోగ్యవంతంగా ఉండేందుకు క్రీడలు యువతరానికి ఎంతగానో ఉపకరిస్తాయి. బాల్యం నుండి క్రీడా రంగంలో రాణించే మట్టిలో మాణిక్యాన్ని వెలికి తీసే ప్రయత్నం చేస్తున్న క్రీడా నిర్వాహకులను అభినందించారు. క్రీడలు మనిషికి పేరు ప్రఖ్యాతలు , సమాజంలో మంచి గుర్తింపునిస్తాయి.నేడు యువత మత్తు,గుట్కా,గంజాయి వంటి వ్యసనాలకు అలవాటు పడుతున్నారు. ఇలాంటి క్రీడా పోటీల ద్వారా మంచి మార్గాన్ని ఎంచుకొని క్రమశిక్షణ గల భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్నేహ యూత్ అధ్యక్షులు ఎండి అజహార్, రాపర్తి కరుణాకర్ ,ఉప్పల లింగస్వామి ,రాసాల యాదయ్య, భాస్కర్,జక్కిడి సుదర్శన్ రెడ్డి,పెదగొని వెంకటేష్, పేరా రమేష్,లచ్చమ్మ గూడెం మల్లేష్ , చిలువేరు జంగయ్య,రేవనపల్లి యాదగిరి, ఆర్ బి రాములు, ఉప్పల కృష్ణ ,గోశిక సామి తదితరులు క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొనడం జరిగింది.

# విద్యార్థినిలు పట్టుదలతో అన్ని రంగాల్లో రాణించాలి

### - డా,, పెండెం కృష్ణ కుమార్



**నర్సంపేట వెలుతురు జనవరి 10:**

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నాలుగు సార్లు పొందిన విభిన్న పాత్రాభినయ కళాకారులు, 400 రోల్స్ యాక్టర్, సమాజ సేవకులు, రచయిత, పర్యవరణ వేత్త డా,, పెండెం కృష్ణ కుమార్ నర్సంపేట మండలంలోని మూడుచెక్కలపల్లి గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ గర్ల్స్ లో అనేక దేశ నాయకుల, శాస్త్రవేత్తల చిత్రపటాలు, మెడికల్ కిట్టు, వాటర్ క్యాన్ , వరల్డ్,ఇండియా ,తెలంగాణ, మ్యాప్స్ ,గోడ గడియారం,ఆట వస్తువులు మరియు క్లాత్ బాగ్స్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డా,, పెండెం కృష్ణ కుమార్ కాలేజ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లో ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థినిలకు పర్యావరణం పై



ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్లు వాడడం వల్ల జరిగే నష్టాలు వివరించి మరియు మొక్కలు నాటుట వాటిని సంరక్షించుట, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుట నీటిని పొదుపుకోవట వంటి కార్యక్రమాలపై వివరించడం జరిగింది.ప్రిన్సిపాల్ మాధవి లత మాట్లాడుతూ దాత పెండెం కృష్ణ కుమార్ కాలేజీలో విద్యార్థులు దేశభక్తిని పెంపొందించడానికి వివిద రకాల స్వాతంత్ర సమరయోధులు , దేశ నాయకుల చిత్ర పటాలను, శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి శాస్త్రవేత్తల చిత్ర పటాలను, పర్యావరణ పరిరక్షణ అలవర్చడానికి క్లాత్ బ్యాగులను మొదలగు సామగ్రి అందించడం అభినందనీయం. ప్రస్తుత భారత దేశ రాష్ట్రపతి గౌరవనీయులు శ్రీమతి ద్రౌపది ముర్మ ప్రశంసలు పొందిన వ్యక్తి కాలేజీ సెమినార్ లో ముఖ్య అతిథిగా పాల్గొనడము ఎంతో స్ఫూర్తిని నింపిందని, విద్యార్థినిల భవిష్యత్తుకు ఒక మార్గదర్శకంగా నిలుస్తుందని ,ప్లాస్టిక్ రహిత సమాజం కొరకు వారి కృషి ఎంతో ప్రశంసదాయకమని, మెడికల్ రంగంలో వారు అందిస్తున్న సేవలు, అన్నదానాలు పేదలకు ఆపన హస్తంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం బేబీ, జ్యోతి, కవిత, సునీత, ఇందిర, నాన్ టీచింగ్ చరిత అంజమ్మ నవీన తులసి తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# క్వార్టార్ ఫైనల్ కు చేరిన శేఖపూర్ సీసీ జట్టు

- **మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా ఎంపికైనా శేఖపూర్ సీసీ బౌలర్ లోకేష్...**
- **ముఖ్య అతిధులుగా హాజరైన ప్రముఖ పారిశ్రామిక వేత్త, కాంగ్రెస్ నాయకులు ప్రసాద్ రెడ్డి**
- **కాంగ్రెస్ పార్టీ జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు ఎండి ముల్తానీ పటేల్**



**జహీరాబాద్ వెలుతురు జనవరి 10:**

ఇంతచక్కటి టౌర్నిని నిర్వహించి దేశం నలుమూలల నుంచి క్రీడాకారులను రప్పించి ఇక్కడ ఆడించడం హర్షించదగ్గ పరిణామం అని, కులమతాలకు అతీతంగా క్రీడలు నిర్వహించి, ఇందులో అన్ని పార్టీల వారిని భాగస్వామ్యం కల్పించి స్థానిక యువతను ఖిజర్ యఫై ప్రోత్సహించడం అభినందనీయమని ప్రముఖ పారిశ్రామిక వేత, జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు కె. ప్రసాద్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు ఎండి ముల్తానీ పటేల్ అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి క్రీడా మైదానంలో శుక్రవారం నాడు ఖిజర్ యఫై గోల్డ్ కప్ క్రికెట్ పోటీల్లో భాగంగా జరిగిన చివరి లీగ్ మ్యాచ్ లో ముఖ్య అతిధులుగా వారు హాజరైయి మాట్లాడారు. ఈ రోజు జరిగిన సూపర్ నాక్కౌట్ మ్యాచ్ శేఖపూర్ సీసీ మరియు కెఎస్ఎం సీసీ జట్ల మద్య జరిగింది. టాస్ గెలిచి శేఖపూర్ సీసీ మొదట బాటింగ్ ఎంచుకొని 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసింది. 204 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కెఎస్ఎం సీసీ 20 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌట్ కాగా శేఖపూర్ సీసీ 76 పరుగులతో విజయం సాధించి క్వార్టార్ ఫైనల్లో ప్రవేశించింది. మ్యాచ్ అనంతరం ముఖ్య అతిధులు కె ప్రసాద్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు ముల్తానీ పటేల్ చేతుల మీదుగా వెయ్యి రూపాయల నగదుతో పాటు ట్రాఫీతో పేస్ బౌలర్ లోకేష్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ చైర్మన్ రాములు నేత, అదం యఫై, అబుద్ యఫై, అబ్దుల్ సమద్, అబ్దుల్ సమి, నిర్వాహక కమిటీ అధ్యక్షుడు సంతోష్ గుప్త, మొయిజుద్దీన్ లష్కరి, వ్యాఖ్యాతలు అబ్దుల్లా సిద్దిఖీ, మొహమ్మద్ ఫెరోజ్, మీడియా ఇంచార్జ్ సయ్యద్ మహెబూబ్ అలీ, రాకేష్ పబ్బతి, ప్రకాష్ మనియర్ పల్లి, తదితరులు పాల్గొన్నారు.



## జహీరాబాద్ లో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం...

● ప్రారంభించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎ సాయి చరణ్...




**జహీరాబాద్ వెలుతురు జనవరి 10:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో కందుల కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ ఎ సాయి చరణ్ , వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఎఎంసి డైరెక్టర్లు కండెం సుజాత, శేఖర్, వంశీ,జాఫార్, కిషన్ రాథోడ్,మల్లరెడ్డి,రైకోడ్ నర్సింహులు ,శంకర్ పటేల్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎ సాయి చరణ్ మాట్లాడుతూ రైతులు కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ప్రభుత్వ మద్దతు ధరకు మార్కెట్ లో కోనుగోలు చెస్తారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్వర్ పిఎసిఎస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్, వీర్ శేట్టి, అశోక్,ఎడిఎ బిక్షపతి, కాంగ్రెస్ నాయకులు ఉగ్గేల్లి రాములు, ఖాజా మీయ తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ -2 బీజేపీ పట్టణ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బసంతపూర్ రమేష్ రెడ్డి ...

**జహీరాబాద్ వెలుతురు జనవరి 10:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ -2 భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులుగా బసంతపూర్ రమేష్ రెడ్డి ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని సంగారెడ్డి జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి , బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతకుమార్, సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు సి. గోదావరి అంజిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బసంతపూర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ నా పై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటానని అన్నారు. అదే విధంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, బిజెపి జిల్లా అధ్యక్షులు గోదావరి అంజి రెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ ముత్తి రెడ్డి, జిల్లా నాయకులు గొల్ల భాస్కర్, శుభాష్ రెడ్డి, విజేందర్ రెడ్డి, రాష్ట్ర జిల్లా సీనియర్ నాయకులకు ధన్యవాదములు తెలిపారు.

## జిల్లా కౌన్సిల్ మెంబెర్ గా ఎన్నికైన ఎం. విశ్వనాథ్ యాదవ్....

**జహీరాబాద్ వెలుతురు జనవరి 10:**



సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ కౌన్సిల్ మెంబెర్ గా ఎం. విశ్వనాథ్ యాదవ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని సంగారెడ్డి జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి , బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతకుమార్, సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు సి. గోదావరి అంజిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎం. విశ్వనాథ్ యాదవ్ మాట్లాడుతూ....నాకు కౌన్సిల్ మెంబెర్ గా నియమంచి, జిల్లా కమిటీ లో అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి, మాజీ ఎంపీ బి బి పాటిల్ కు ధన్యవాదాలు తెలిపారు. అదేవిదంగా పదవి రావడం కోసం కృషి చేసిన ఢిల్లీ వసంత్, గొల్ల భాస్కర్ బీజేపీ జహీరాబాద్ నాయకులు, జిల్లా రాష్ట్ర నాయకులకు పేరు పేరున ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. బీజేపీ ఎదుగుదలకు నా వంతు కృషి చేస్తానని, ప్రజా సమస్యల నిరంతరం పోరాటం చేసి స్థానిక ఎన్నికలో బీజేపీ తరుపున కార్యకర్తలు పోటీ చేసే విదంగా తను వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు.

## పోలీసులకు సంక్రాంతి కానుక

● 187మందికి ఎస్ఐలుగా ప్రమోషన్

హైదరాబాద్,జనవరి10( **వెలుతురు**) :
కానిస్టేబుల్స్‌కు తెలంగాణ ప్రభుత్వం సంక్రాంతి కానుక ప్రకటించింది. 1989, 1990 బ్యాచ్ లో ఎంపికైన పోలీస్ కానిస్టేబుల్స్‌కు ప్రభుత్వం ప్రమోషన్ కల్పించింది. హైదరాబాద్ రీజియన్లోని 187 ఎఎస్‌లకు ఎస్ఐ గా ప్రమోషన్ కల్పించింది. ఈ మేరకు డిజిపి జితేందర్ఆదేశాలతో ప్రమోషన్లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రీ ప్రమోషనల్ ట్రైనింగ్ పూర్తి చేసిన రోజునే ప్రమోషన్స్ ఇవ్వడంతో సిబ్బందిలో ఆనందోత్సవాలతో సంబరాలు చేసుకుంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో పోలీస్ డిపార్ట్ మెంట్ ను పెద్దగా పట్టించుకోలేదు. కానిస్టేబుళ్ల ప్రమోషన్స్ ను నిర్లక్ష్యం చేసింది. కోర్టుల్లో కేసులున్నాయంటూ ప్రమోషన్లు ఆపేసింది. ఇతర డిపార్టమెంట్లలో తమతో పాటు జాయిన్ వారు పెద్ద పొజిషన్‌లో ఉండగా.. తాము మాత్రం ఎక్కడికక్కడే మిగిలిపోవాల్సివచ్చిందని కానిస్టేబుల్స్ బాధ పడేవారు. ఈ క్రమంలో 187 మందికి ప్రమోషన్ కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వం.





## శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ పాఠశాలలో సంక్రాతి పండుగ సంబరాలు




**బొల్లారం వెలుతురు జనవరి 10:**
సంక్రాతి పండుగ సందర్భంగా బొల్లారం మున్సిపల్ పరిధిలోని శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ పాఠశాలలో కేవిఆర్ పాఠశాల , శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ పాఠశాల వ్యవస్థాపకుడు కొత్వాల్ హరి కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలో ముగ్గుల పోటీ ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలలో విద్యార్థుల మాతృమూర్తులు మరియు ఉపాధ్యాయినిలు ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. సంక్రాతిని ప్రతిభంభించేలా వేసిన ముగ్గుకు ప్రథమ బహుమతి, ఆలోచనత్మాకంగా వేసిన ముగ్గుకు ద్వితీయ బహుమతి, సందేశంత్మకంగా వేసిన ముగ్గుకు తృతీయ బహుమతులను శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ పాఠశాల వ్యవస్థాపకుడు కొత్వాల్ హరి కృష్ణా రెడ్డి అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు సంక్రాతి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అందరికి సంక్రాతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో సందర్శించాల్సిన 21 అత్యుత్తమ పర్యాటక ప్రదేశాలు

*ఆంధ్రప్రదేశ్ సమృద్ధమైన సాంస్కృతిక వారసత్వం, ప్రకృతి సౌందర్యం, మరియు చారిత్రక ప్రాధాన్యత కలిగిన రాష్ట్రం, పర్యాటకులకు విస్తృత స్థలాలను అందిస్తుంది. ఇక్కడ ఆంధ్రప్రదేశ్‌లో తప్పనిసరిగా సందర్శించాల్సిన 21 ప్రదేశాలు ఉన్నాయి:*




**1. తిరుపతి:**
ప్రత్యేకతలు:
ప్రపంచంలోనే అత్యధికంగా సందర్శించబడే యాత్రాకేంద్రమైన తిరుమల వెంకటేశ్వర దేవాలయం ఇక్కడే ఉంది.
ఇతర ఆకర్షణలు: కపిల తీర్థం, చంద్రగిరి కోట.

**2. అరకు వ్యాలీ**
ప్రత్యేకతలు:
ఆకట్టుకునే పచ్చటి పర్వత ప్రాంతం, కాఫీ తోటలు, గిరిజన సంస్కృతికి ప్రసిద్ధి.
బొర్రా గుహలు, కటికీ జలపాతాలు, గిరిజన మ్యూజియం చూడదగినవి.

**3. విశాఖపట్నం (వైజాగ్)**
ప్రత్యేకతలు:
ఆర్కే బీచ్, రుషికొండ బీచ్ వంటి బీచ్‌లతో ప్రసిద్ధమైన తీర నగరం.
ఆకర్షణలు: కైలాసగిరి, INS కురుసురా సబ్‌మెరైన్ మ్యూజియం, సింహాచలం దేవాలయం.

**4. విజయవాడ**
ప్రత్యేకతలు:
"విజయవాడ "గా పిలువబడే ఈ నగరంలో కనకదుర్గ దేవాలయం, ప్రకాశం బ్యారేజ్ ప్రసిద్ధి.
భవానీ దీవి, కొండపల్లి కోట సందర్శించవచ్చు.

**5. అమరావతి**
ప్రత్యేకతలు:
బౌద్ధ స్మారకమైన అమరావతి స్తూపం చారిత్రక ప్రాముఖ్యత కలిగి ఉంది.
ఆధునిక రాజధాని ప్రాజెక్టులు, శ్రీ అమరలింగేశ్వర స్వామి దేవాలయం చూడవచ్చు.

**6. లేపాక్షి**
ప్రత్యేకతలు:
పురాతన వీరభద్ర స్వామి దేవాలయం, తేలియాడే స్తంభంతో ప్రసిద్ధి.
మహా నంది విగ్రహం, గంపలు నిక్షిప్త కవచాల కళాఖండాలు.

**7. గండికోట**
ప్రత్యేకతలు:
కడప జిల్లాలో గల "భారత గ్రాండ్ కేనియన్" అందమైన నది గుండాలు.
గండికోట కోట, పెన్నా నది దృశ్యాలు చూడవచ్చు.

**8. శ్రీకాళహస్తి**
ప్రత్యేకతలు:
శ్రీకాళహస్తీశ్వర దేవాలయం, శివునికి అంకితమైనది.
ఆధ్యాత్మిక, శిల్పకళా వైభవం ప్రసిద్ధం.

**9. బెలూం గుహలు**
ప్రత్యేకతలు:
నంద్యాల జిల్లాలో ఉన్న భారతదేశంలో రెండవ అతిపెద్ద గుహల సముదాయం.
అద్భుతమైన ప్రాకృతిక శిలాశిల్పాలు చూడవచ్చు.

**10. కర్నూలు**
ప్రత్యేకతలు:
రాయలసీమకు గేట్వే.
అహోబిలం ఆలయం, కొండా రెడ్డి కోట, ఒర్వకల్ రాక్ గార్డెన్ చూడవచ్చు.

**11. రాజమండ్రి**
ప్రత్యేకతలు:
ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక రాజధాని, గోదావరి నదితో అనుసంధానం.
గోదావరి బ్రిడ్జ్, ధౌలేశ్వరం బ్యారేజ్, పాపి కొండలు సందర్శించ వచ్చు.

**12. కోనసీమ**
ప్రత్యేకతలు:
పచ్చని కొబ్బరి తోటలు, ప్రశాంతమైన బ్యాక్ వాటర్‌లతో ప్రకృతి అందాల సమాహారం.
హౌస్ బోట్ అనుభవం ప్రత్యేకం.

**13. అనంతపురం**
ప్రత్యేకతలు:
లేపాక్షి ఆలయం, పెనుకొండ కోట, మరియు ప్రపంచంలోనే పెద్ద బనియన్ చెట్టు తిమ్మమ్మ మర్రి మాను.

**14. నాగార్జునకొండ**
ప్రత్యేకతలు:
కృష్ణా నది మధ్యనున్న ద్వీపం, బౌద్ధ ధాతువులు, పురావస్తు మ్యూజియంతో ప్రసిద్ధి.

**15. హార్సీ హిల్స్**
ప్రత్యేకతలు:
హాయిగా వాతావరణం, అందమైన ప్రకృతి దృశ్యాలు.
ట్రెక్కింగ్, నేచర్ వాక్స్ కోసం ప్రసిద్ధి.

**16. కడప**
ప్రత్యేకతలు:
గండికోట కోట, అమీన్ పీర్ దర్గా, పుష్పగిరి ఆలయాలు ప్రసిద్ధి.

**17. మహానంది (నంద్యాల జిల్లా)**
ప్రత్యేకతలు:
ప్రాచీన మహానందీశ్వర స్వామి ఆలయం, పవిత్ర జలకుండాలు ప్రసిద్ధి.

**18. మచిలీపట్నం**
ప్రత్యేకతలు:
బీచ్‌లు, చారిత్రక బందర కోట ప్రసిద్ధి.
కలంకారి కళ, వస్త్రాలు ప్రత్యేకం.

**19. పుట్టపర్తి**
ప్రత్యేకతలు:
శ్రీ సత్యసాయి బాబా జన్మస్థలం, ప్రసాంతి నిలయం ఆశ్రమం.
ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రసిద్ధి.

**20. నాగార్జున సాగర్**
ప్రత్యేకతలు:
భారతదేశంలోనే అతిపెద్ద డ్యామ్‌లలో ఒకటి.
ఏతిపోతల జలపాతాలు, నాగార్జునకొండ ద్వీపం చూడవచ్చు.

**21.శ్రీకాకుళం**
ప్రత్యేకతలు :
అరసవిల్లి, శ్రీ కూర్మం, శ్రీ మొఖలింగం క్షేత్రాలు, సాలిహుండం బౌద్ధ స్తూపాలు
ప్రయాణ సూచనలు:
సందర్శనానికి ఉత్తమ సమయం: అక్టోబర్ నుండి మార్చి.
సాంస్కృతిక కార్యక్రమాలు: సంక్రాంతి, ఉగాది, తిరుపతి బ్రహ్మోత్సవం కోల్పోవద్దు.
స్థానిక వంటకాలు: ఆంధ్ర భోజనాలు, గోంగూర పచ్చడి, పెసరట్టు తప్పక రుచించండి.

# సినిమా టికెట్ల ధరలు, ప్రత్యేక ప్రదర్శనలపై అసంతృప్తి

- ప్రభుత్వ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని హైకోర్టు ఆదేశం
- గేమ్‌ఛేంజర్‌కు ప్రత్యేక అనుమతులపై విచారణ 24కు వాయిదా







**హైదరాబాద్,జనవరి10( వెలుతురు):**
గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ల ధరలు, ప్రత్యేక ప్రదర్శనలపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రత్యేక ప్రదర్శనల అనుమతిపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. బెనిఫిట్ షోలు రద్దు చేశామంటూ పరోక్షంగా ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడమేంటని న్యాయస్థానం ప్రశ్నించింది. అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తర్వాత తెల్లవారుజామున షోలకు అనుమతి ఇవ్వడంపై పునసమీక్షించాలని హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది. కాగా.. అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 సినిమా రిలీజ్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందగా... బాలుడు అస్వస్థతకు గురయ్యాడు. ఈ కేసుకు సంబంధించి అల్లు అర్జున్ జైలుకు వెళ్లి.. బెయిల్‌పై బయటకు వచ్చారు. అయితే తొక్కిసలాట ఘటనను తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇకపై బెన్‌ఫిట్‌షోల కు అనుమతించేది లేదని స్పష్టం చేసింది. దిల్ రాజు నేతృత్వంలో సినీ పెద్దలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలువగా ఇదే విషయాన్ని తేల్చి చెప్పారు సీఎం. ఇదిలా ఉండగా... శంకర్ దర్శకత్వంలో రాంచరణ్ నటించిన గేమ్ చేంజర్ సినిమా టికెట్‌ల ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అర్ధారత్రి ఒంటి గంటకు బెనిఫిట్ షోలకు అనుమతించని ప్రభుత్వం.. తెల్లవారుజామున 4 గంటల నుంచి 6 గంటల షోకు అనుమతినిస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ల పెంపు, స్పెషల్ షోలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొందరు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. గురువారం ఈ పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి విచారించగా.. గేమ్ చేంజర్ సినిమా స్పెషల్ షోకు అనుమతి ఇవ్వడంపై పిటిషనర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. టికెట్ పెంపుపై ఉత్తర్వులు ఇవ్వకుండా ఆదేశించాలని హైకోర్టును పిటిషనర్ కోరారు. దీనిపై విచారణను శుక్రవారానికి వాయిదా వేసిన కోర్టు.. నేటి విచారణలో ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. తెల్లవారుజామున షోలకు అనుమతి ఇవ్వడంపై పునసమీక్షించాలని హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 24కు హైకోర్టు వాయిదా వేసింది.

# గోషామహల్‌లో చాక్నావాడికి నాలా కుంగుబాటు

- దిగబడిపోయిన భారీ క్రషర్ వాహనం

**హైదరాబాద్,జనవరి10( వెలుతురు):**
హైదరాబాద్ నగరంలోని గోషామహల్ ప్రాంతంలో మరోమారు నాలు కుంగి అందులో భారీ వాహనం పడిపోయింది. ఈ ప్రాంతంలో వరుసగా రోడ్డు కుంగుబాటుకు గురవడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఆ ప్రాంతంలో నడిచి వెళ్లాలంటేనే ప్రజలు వణికిపోయే పరిస్థితి.. ఎక్కడ రోడ్డు కుంగుబాటుకు గురవుతుందో.. ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయపడిపోతున్నారు. తాజాగా శుక్రవారం కూడా భారీ శబ్దంతో రోడ్డు కుంగిపోయింది. దీంతో ప్రజలు భయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు. గోషామహల్‌లో చాక్నావాడికి నాలా కుంగుబాటుకు గురైంది. దారుసలామ్ రోడ్డు నుంచి చాక్నావాడికి వెళ్లే రోడ్డులో ప్లైవుడ్ దుకాణాల ముందు నాలా కుంగింది. గతంలో కుంగిన నాలా పనులు కొనసాగుతుండగా ప్రక్కనే ఉన్న మరో నాలా కుంగుబాటుకు గురైంది. ఈ సమయంలో నాలాపై ఉన్న క్రషర్ లారీ అందులో పడిపోయింది. దాదాపు పది అడుగుల లోతులో భారీ ట్రక్కు దిగబడిపోయింది. అయితే ట్రక్కులో ఉన్న లారీ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. పెను ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఇప్పటికే చాక్నావాడికి నాలా కుంగుబాటుకు గురవడం ఇది మూడో సారిగా చెప్పుకోవచ్చు. అయితే ప్రతీసారి ఇలా నాలా కుంగుబాటుకు గురవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అతిపురాతనమైన నాలా కావడంతో కుంగినట్లుగా స్థానికులు చెబుతున్నారు. నాలా మొత్తాన్ని పునరుద్ధరించాలని ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఇలా వరుసగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ప్రతీసారి నాలా కుంగడంతో ఆ ప్రాంతంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని చెబుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి నాలా పునరుద్ధరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కాగా గత ఏడాది అక్టోబర్‌లో చాక్నివాడికి వెళ్లే మార్గంలో భారీగా రోడ్డు కుంగింది. ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అంతుకు ముందు 2022లో కూడా ఇదే ప్రాంతంలో నాలా కుంగింది. భారీ శబ్దంతో నాలా కుంగడంతో భూకంపం వచ్చిందేమో అని స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో పదుల సంఖ్యలో వాహనాలు అందులో పడిపోయాయి. అలాగే సంత జరుగుతుండటంతో కూరగాయల బండ్లు కూడా గుంతలో పడిపోయాయి.

## హరీష్ అరెస్ట్ విషయంలో హైకోర్టు ఆదేశం

- మధ్యంతర ఉత్తర్వులు పొడిగింపు

**హైదరాబాద్,జనవరి10( వెలుతురు):**
ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావును అరెస్టు చేయవద్దన్న మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టును పొడిగించింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి గాదగోని చక్రధర్ గౌడ్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసుపై తాజాగా హైకోర్టు విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేయాలని చక్రధర్ గౌడ్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు హరీశ్‌రావును అరెస్టు చేయవద్దనే ఉత్తర్వులను పొడిగించింది. హరీశ్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో తన ఫోన్ ట్యాపింగ్ చేశారని, తనపై బెదిరింపులకు పాల్పడ్డారని గత నెల 1వ తేదీన సిద్దిపేటకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి, కాంగ్రెస్ నేత గాదగోని చక్రధర్ గౌడ్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో హరీశ్‌రావుపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో తనపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను రద్దు చేయాలని, తనను అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలని హరీశ్‌రావు అప్పట్లో హైకోర్టును ఆశ్రయించారు. హరీశ్‌రావు పిటిషన్‌పై గతంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. ఆయన్ను అరెస్టు చేయరాదని పోలీసులను ఆదేశించింది. హరీశ్‌రావుపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోరాదని కూడా పంజాగుట్ట పోలీసులకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. హరీశ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన చక్రధర్‌గౌడ్‌కు నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆయనను ఆదేశించింది.

# భూసేకరణవల్లే రైల్వే లేన్ నిర్మాణ పనుల్లో జాప్యం

(మొదటి పేజీ తరువాయి..)
జాప్యం జరుగుతోందన్నారు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే నిర్మాణ పనులను 2027 నాటికి పూర్తి చేయనున్నట్లు చెప్పారు. అట్లాగే వచ్చే మార్చి నాటికి కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు పూర్తవుతాయని తెలిపారు. 60 కోట్లతో చేపట్టిన కొత్తపల్లి రైల్వే స్టేషన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. జమ్మికుంట ఉప్పల్ ఆర్వోబీ నిర్మాణం అనేక కారణాలవల్ల జాప్యం జరిగిందన్నారు. రాబోయే 3 నెలల్లో ఉప్పల్ ఆర్వోబీ నిర్మాణ పనులను పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు చెప్పారు.



శుక్రవారం రోజున కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కరీంనగర్ రైల్వే స్టేషన్, కొత్తపల్లి రైల్వే స్టేషన్ ను సందర్శించారు. పనుల కొనసాగుతున్న తీరును పరిశీలించారు. తీగలగుట్టపల్లి ఆర్వోబీని సందర్శించారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అంతకుముందు మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే....

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతిపై ఈరోజు సంబంధిత అధికారులతో సమీక్షించాను. అందులో భాగంగా కరీంనగర్ రైల్వే స్టేషన్ ను, తీగలగుట్టపల్లి ఆర్వోబీ, కొత్తపల్లి స్టేషన్ నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నా. పనులను స్పీడప్ చేయాలని కోరిన. అట్లాగే కరీంనగర్ రైల్వే స్టేషన్, తీగలగుట్టపల్లి ఆర్వోబీ, కొత్తపల్లి స్టేషన్ ను విజిట్ చేయడం జరిగింది.



మీకు తెలుసు. 'అమృత్ భారత్' పథకంలో భాగంగా ప్రియతమ ప్రధాని నరేంద్రమోడి గారు దేశవ్యాప్తంగా 25 వేల కోట్ల రూపాయలు వెచ్చించి ఏకకాలంలో 1350 రైల్వే స్టేషన్లను ఆధునీకరించి ఆదర్శ స్టేషన్లుగా తీర్చిదిద్దాలని సంకల్పించారు. ఇదొక చరిత్ర. ప్రపంచంలోనే ఒకేసారి ఇన్ని స్టేషన్లను ఆధునీకరిస్తున్న చరిత్ర ఏ దేశానికి లేదు. మన రాష్ట్రం విషయానికొస్తే 40 స్టేషన్లను డెవలప్ చేస్తున్నం. ఆ జాబితాలో మన కరీంనగర్ రైల్వే స్టేషన్ ఎంపికైంది. 2023 ఆగస్టులో అభివృద్ధి పనులు స్టార్ట్ చేసినం. మొత్తం 44 కోట్ల 16 లక్షల రూపాయల వ్యయం అంచనా వ్యయంతో పనులు చేపట్టినం.

సరిగ్గా 6 నెలల క్రితం వరకు కరీంనగర్ రైల్వే స్టేషన్ ఎట్లుండేదో మీకు తెలుసు. ప్రయాణీకులకు కనీస సౌకర్యాలు కూడా లేకుండే. కానీ మోదీగారి విజన్ పుణ్యమా? అని ఊహించని విధంగా కరీంనగర్ స్టేషన్ అభివృద్ధి అవుతోంది. రైల్వే స్టేషన్ భవనాన్ని అప్ గ్రేడ్ చేస్తున్నం. సోలార్ పవర్ ప్లాంట్ ను ఏర్పాటు చేస్తున్నం. ఎస్కలేటర్, లిఫ్ట్ పనులు చకచకా కొనసాగుతున్నాయి. ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, కొత్త ప్లాట్‌ఫారాలు పనులు ఇప్పటికే పూర్తయినయ్. రోడ్డు అభివృద్ధి, ప్లాట్‌ఫారం షెల్టర్‌లు, టాయిలెట్ గదుల పునర్నిర్మిస్తున్నం. జెట్ స్పీడ్ తో శరవేగంగా పనులు కొనసాగుతున్నయ్. ముందుగా అనుకున్నట్లుగానే ఈ ఏడాది(2025) మార్చి 31నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేసి కరీంనగర్ రైల్వే స్టేషన్ ను ఆదర్శ స్టేషన్ గా అందుబాటులోకి తీసుకురాబోతున్నం. కష్టపడి పనిచేస్తున్న రైల్వే సిబ్బందిని మనస్పూర్తిగా అభినందిస్తున్నా...

అట్లాగే సేతు బంధన్ స్కీం కింద 154 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన కరీంనగర్ ఆర్వోబీ నిర్మాణ పనులను కూడా పరిశీలించడం జరిగింది. పూర్తిగా కేంద్ర నిధులతోనే ఆర్వోబీని నిర్మిస్తున్నం. అయితే సొమ్మొకడిది, సోకు మరొకరిదన్నట్లుగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో, కనీసం ఎంపీగా సమాచారం ఇవ్వకుండా కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేసిన సంగతి కూడా మీకు తెలుసు. ఆ విషయాల్లోకి నేను వెళ్లదలుచుకోలేదు. 2023 జులై 13న కరీంనగర్ ఆర్వోబీ నిర్మాణానికి భూమి పూజ చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో పనులు కొనసాగలేదు. ఒప్పందం ప్రకారం ఈ ఏడాది జులై నాటికి ఆర్వోబీ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. కానీ అధికారుల, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోపాటు గత ప్రభుత్వం నుండి ఆశించిన స్థాయిలో సహకారం అందకపోవడంవల్ల ఆశించిన స్థాయిలో పనులు కాలేదు. తొందరగా ప్రజలకు ఆర్వోబీని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రత్యేక దృష్టి పెట్టినం. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని అధికారులను కోరడం జరిగింది. ఆర్వోబీ నిర్మాణం సందర్భంగా తీగలగుట్టపల్లి వద్ద రోడ్డు అధ్వాన్నంగా మారి ప్రయాణీకులు తీవ్ర ఇబ్బంది పడుతున్న విషయం నా దృష్టికి వచ్చింది. వెంటనే అధికారులతో మాట్లాడి 36 లక్షల రూపాయలు మంజూరు చేయించి అప్రోచ్ రోడ్డును నిర్మించాలని నిర్ణయించినం. శుక్రవారం రోజున అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేయడం జరిగింది.

ఇగ ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి మెదక్ జిల్లాల ప్రజల చిరకాల స్వప్నమైన కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వే లేన్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించడం జరిగింది. 2016 జూలై 21న కొత్తపల్లి- మనోహరాబాద్ కొత్త రైల్వే లేన్ కు సంబంధించి మొత్తం 151. 36 కి.మీల మేరకు నిర్మాణ పనులకు కేంద్రం ఆమోదం తెలిపింది. నిజానికి ఆనాడు ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం 1160 కోట్ల 48 లక్షల రూపాయలు. కానీ అనేక కారణాలవల్ల నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. ఈ విషయం మోదీగారి దృష్టికి, రైల్వే మంత్రి అశ్వీనీ వైష్ణవ్ గార్ల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే వారు సానుకూలంగా స్పందించారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు కొత్తవాటిని మంజూరు చేయకూడదని, పెండింగ్ ప్రాజెక్టులకు అవసరమైన నిధులన్నీ కేటాయించేందుకు సిద్ధమైనరు. అందులో భాగంగా కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లేన్ నిర్మాణ పనులు పూర్తి కావాలంటే సవరించిన లెక్కల ప్రకారం...మొత్తం 2 వేల 780 కోట్ల 78 లక్షలు ఖర్చవుతుందని రైల్వే అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 14 వందల 44 కోట్ల 17 లక్షల రూపాయలు ఖర్చు చేసినం. ఒప్పందం ప్రకారం మొత్తం ప్రాజెక్టు వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం మూడో వంతు వాటా చెల్లించాల్సి ఉంది.





మొత్తం 151. 36 కి.మీల మేరకు పనులకుగాను ఇప్పటి వరకు 76.135 కిలోమీటర్ల మేరకు పనులు పూర్తయిన్. ఇంకా 75 కి.మీలకుపైగా నిర్మాణ పనులు చేయాల్సి ఉంది. ఈ బడ్జెట్ లో(2024-25) 350 కోట్ల రూపాయలు మంజూరు చేసినం. ఇప్పటి వరకు 262 కోట్ల 93 లక్షల రూపాయలు ఖర్చు చేసినం. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల పరిధిలోని మరో 30 కి.మీలకు పైగా రైల్వే నిర్మాణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నం.

ఒప్పందం ప్రకారం రైల్వే లేన్ నిర్మాణానికి అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వమే సేకరించి ఇవ్వాలి. కానీ భూసేకరణ విషయంలోనే చాలా జాప్యం జరగడంతో రైల్వే లేన్ నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో జరగలేదు. ప్రస్తుతానికి భూసేకరణ సమస్య 90 శాతం మేరకు పరిష్కారమైంది. మొత్తం 1145.627 హెక్టార్ల (సుమారు 2వేల 830 ఎకరాలు) భూమిని సేకరించాల్సి ఉండగా 199 ఎకరాలు మినహా మిగిలిన భూసేకరణ పూర్తయ్యింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 37.5 ఎకరాల (15.211 హెక్టార్లు) ఫారెస్ట్ భూమిని మళ్లించాల్సి ఉంది. ఆ సమస్య కూడా త్వరలోనే పరిష్కారమవుతుందని భావిస్తున్నం.

అట్లాగే ఈ ఏడాది డిసెంబర్ నాటికి వేములవాడ నుండి కొత్తపల్లి వరకు 31.06 కి.మీల మేరకు నిర్మాణ పనులను, వచ్చే ఏడాది(2026) మార్చి నాటికి సిరిసిల్ల, వేములవాడ పరిధిలో 10.7కి.మీల పనులను పూర్తి చేయాలని అధికారులను కోరడం జరిగింది. సిద్దిపేట-సిరిసిల్ల (76.13 కి.మీ నుండి 106.8 కి.మీ) వరకు పనుల నిర్మాణానికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయింది. పనులు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి సిద్దిపేట-సిరిసిల్ల కొత్త బ్రాడ్ గేజ్ పనులను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

కొత్తపల్లి స్టేషన్ వద్ద సరుకు రవాణా సౌకర్యాలతో కొత్తపల్లి జంక్షన్ స్టేషన్ గా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. టెండర్లు కేటాయించారు. పనులు కొనసాగుతున్నాయి. మార్చినాటికి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. సిరిసిల్ల-వేములవాడ (106.8 నుండి 111.5 కి.మీ వరకు) పనులు (ఇంజనీరింగ్, ప్రొక్యూర్ మెంట్, కన్ స్ట్రక్షన్) దశలో ఉన్నాయి. అట్లాగే మానేరు నదిపై ముఖ్యమైన వంతెనను నిర్మించబోతున్నం. ఈనెలాఖరులోగా EPC టెండర్ ప్రక్రియను ప్రారంభించబోతున్నం. ఈ బ్రిడ్జి చాలా కీలకం. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ఈ మార్గంలో నిరంతరం రైలు ప్రయాణం సులభమవుతుంది.

ఏదేమైనప్పటికీ 2027 నాటికి కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లేన్ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నం. ఈ రైల్వే లేన్ అందుబాటులోకి వస్తే... తెలంగాణ రాష్ట్రంలోని మెదక్, సిద్దిపేట, రాజన్న సరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. ఈ ప్రాంత ప్రజలకు రైల్వే ప్రయాణం అందుబాటులోకి వస్తుంది. అట్లాగే సికింద్రాబాద్ - ఖాజీపేట రైల్వే లేన్ లో ఏమైనా అవాంతరాలు, ప్రమాదాలు ఏర్పడితే... కొత్తపల్లి -మనోహరాబాద్ రైల్వే లేన్ ద్వారా న్యూఢిల్లీకి వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు మెరుగవుతాయి.

జమ్మికుంట మండలం ఉప్పల్ వద్ద నిర్మిస్తున్న ఆర్వోబీ నిర్మాణంపైనా సమీక్షించడం జరిగింది. ఎందుకు జాప్యం జరుగుతోంది? కారణాలేంటని అధికారులను అడిగి తెలుసుకున్న. వాస్తవానికి 2015-16 బడ్జెట్ లోనే ఉప్పల్ ఆర్వోబీ నిర్మాణానికి కేంద్రం ఆమోదం లభించింది. మొత్తం 54 కోట్ల 15 లక్షల అంచనా వ్యయం అవుతుందని అంచనా వేశారు.

ఒప్పందం ప్రకారం... రైల్వే శాఖ 23 కోట్ల 60 లక్షల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం 30 కోట్ల 54 లక్షల రూపాయలు భరించాల్సి ఉంది. కానీ అనేక కారణాలవల్ల పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఆశించిన సహకారం లభించలేదు. ప్రస్తుతం సవరించిన అంచనాల ప్రకారం ఉప్పల్ ఆర్వోబీ నిర్మాణ వ్యయం 72 కోట్ల 54 లక్షలు. ఒప్పందం ప్రకారం... రాష్ట్ర ప్రభుత్వం 57 కోట్ల 13 లక్షలు, రైల్వే వాటా 15 కోట్ల 41 లక్షలు భరించాలి. ప్రస్తుతం అప్రోచ్ రోడ్డు పనులు కూడా పూర్తయినయ్. చివరి దశలో పనులు కొనసాగుతున్నయ్. వచ్చేనెలాఖరుకల్లా నిర్మాణ పనులను పూర్తి చేసి ఉప్పల్ ఆర్వోబీని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.


# డికెక్టివ్‌గా మమ్ముట్టి




మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం డొమినిక్ అండ్ ది లేడీస్ పర్సు. తమిళ అగ్ర దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మమ్ముట్టి సొంత ప్రొడక్షన్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం రిపబ్లిక్ డే కానుకగా జనవరి 23న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలోనే మూవీ నుంచి ట్రైలర్‌ను వదిలారు మేకర్స్. ఈ మూవీ ట్రైలర్ చూస్తుంటే.. మమ్ముట్టి ఇందులో డొమినిక్ అనే డిటెక్ట్‌వ్ పాత్రలో నటించబోతున్నాడు. ఆసుపత్రిలో దొరికిన లేడీస్ పర్సుకి సంబంధించి ఈ కథ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. తప్పిపోయిన ఆ లేడీస్ పర్స్ ఎవరిది అని డొమినిక్ కనిపెట్టాడా.. ఇంతకీ ఆ పర్స్‌లో ఏముంది.. ఈ పర్స్‌కి మర్డర్స్‌కి సంబంధం ఏంటి అనేది తెలియాలంటే ఈ సినిమా వచ్చేవరకు వెయిట్ చేయాల్సిందే. డా.నీరజ్ రాజన్ ఈ సినిమాకు కథను అందిస్తుండగా.. గోకుల్ సురేష్ , సుస్మితా భట్ , విజి వెంకటేష్ , వినీత్ , విజయ్ బాబు తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలో నటించబోతున్నారు.

## గేమ్ ఛేంజర్ బెనిఫిట్ షోలపై హైకోర్టు అసంతృప్తి

గేమ్ ఛేంజర్ టికెట్ రేట్లతో పాటు బెనిఫిట్ షోలకు సంబంధించి తెలంగాణ హైకోర్టు నేడు విచారణ జరిగింది. పుష్ప 2 ది రూల్ సినిమాకు సంబంధించి సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన మరవకముందే మరో సినిమాకు బెనిఫిట్ షోలు అనుమతినివ్వడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. బెనిఫిట్ షోలు రద్దని చెప్పి మళ్లీ ప్రభుత్వమే అనుమతి ఇవ్వడం ఏంటి అని ప్రశ్నించింది. ప్రేక్షకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బెనిఫిట్ షోలకు అనుమతించొద్దని తెలిపింది. అంతేగాకుండా నిర్మాతలు భారీ బడ్జెట్‌తో సినిమాలు తీసి ప్రేక్షకుల నుంచి అన్యాయంగా వసులు చేయడం సరికాదని తెలిపింది. అలాగే అర్ధరాత్రి 1 గంటల తర్వాత సినిమా షోలకి పర్మిషన్ ఇవ్వడంపై పునఃసమీక్షించాలని కోరింది. ఈ మేరకు హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తను ఆదేశించింది. ఈ కేసుపై తదుపరి విచారణను జనవరి 24కి వాయిదా వేసింది.






## బాలకృష్ణతో నటించడం అదృష్టం - ప్రగ్య జైస్వాల్

'ఇందులో నా పేరు కావేరి. అభినయానికి ఆస్కారమున్న డీ గ్లామరస్ రోల్. ఇప్పటివరకూ నేను చేసిన పాత్రలకు పూర్తి భిన్నమైన పాత్ర. ఛాలెంజ్‌గా తీసుకొని చేశాను. దర్శకుడు బాబీ ఈ పాత్రను అద్భుతంగా డిజైన్ చేశారు.' అని కథానాయిక ప్రగ్య జైస్వాల్ తెలిపారు. బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన చిత్రం 'డాకు మహారాజ్'. ఈ సినిమాలో వన్ ఆఫ్‌ది హీరోయిన్‌గా నటించింది ప్రగ్యా జైస్వాల్. సంక్రాంతి కానుకగా ఈ నెల 12న చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ప్రగ్యా విలేకరులతో ముచ్చటించింది. 'బాలకృష్ణగారితో వరుసగా సినిమా చేసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా. 'అఖండ'తో నా కెరీర్ మలుపు తిరిగింది. ఇప్పుడు 'డాకు మహారాజ్' లాంటి గొప్ప సినిమాలో మళ్లీ ఆయనతో కలిసి నటించే భాగ్యం దొరికింది' అంటూ ఆనందం వెలిబుచ్చింది ప్రగ్య జైస్వాల్. దర్శకుడు బాబీ ఈ కథ చెప్పినప్పుడే పెద్ద హిట్ అవుతుందని నమ్మానని, నిర్మాత నాగవంశీ పాషన్‌తో సినిమా నిర్మించారని ప్రగ్య పేర్కొన్నారు. జనవరి 12 తన పుట్టినరోజు అని, అదేరోజు 'డాకు మహారాజ్' విడుదల అవుతుండటం సంతోషంగా ఉందని ప్రగ్యా జైస్వాల్ పేర్కొంది.



# బాలయ్యకు తగ్గని క్రేజ్

## గంటలోనే లక్షా 56వేలకుపైగా టికెట్స్ సేల్

నందమూరి బాలకృష్ణ కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం డాకు మహారాజ్. బాబీ దర్శకత్వంలో ఎన్‌బీకే 109గా తెరకెక్కుతున్న ఈ మూవీలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌటేలా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. డాకు మహారాజ్ జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. విడుదలకు ఇంకా రెండు రోజులే ఉండటంతో టికెట్ బుకింగ్ అప్‌డేట్ వచ్చేసింది. డాకు మహారాజ్ టికెట్ బుకింగ్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వ్యాప్తంగా థియేటర్లలో టికెట్ బుకింగ్స్ ఇవాళ మొదలయ్యాయి. పరిమిత షోలతో బుకింగ్స్ మొదలైన గంటలోనే లక్షా 56వేలకుపైగా టికెట్స్ సేల్ అయ్యాయి. బాలకృష్ణ సినిమాకు క్రేజ్ ఎలా ఉందో ఈ వార్త మరోసారి చెప్పేస్తుంది. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నాడు. రోనిత్ రాయ్, శ్రద్దా శ్రీనాథ్, ప్రగ్యాజైశ్వాల్, చాందినీ చౌదరి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.



## బీచ్‌లో ఛిల్ అయిన అలియాభట్


గ్లామరస్ రోల్స్‌తోపాటు నటనకు ఆస్కారమున్న పాత్రలు చేస్తూ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారే భామల్లో టాప్‌లో ఉంటుంది బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్. గతేడాది జిగ్రా సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ భామ ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉంది. కాగా ప్రొఫెషనల్‌గా బిజీగా ఉండే ఈ బ్యూటీ షూటింగ్ పనుల నుంచి బ్రేక్ తీసుకుంది. ప్రస్తుతం వెకేషన్ టూర్‌ను ఎంజాయ్ చేస్తోంది. ఈ భామ ఇంతకీ ఎక్కడికెళ్లిందో తెలుసా..? ప్రపంచ ప్రఖ్యాత టూరిజం స్పాట్స్‌లో ఒకటైన థాయ్‌లాండ్. బికినీలో థాయ్‌లాండ్ దీవుల్లోని సముద్రంలో జలకాలాడింది. సాగరతీరంలో విహరిస్తూ ప్రకృతిని అందాలను ఆస్వాదించింది. బ్లాక్ గాగుల్స్ పెట్టుకొని స్టైలిష్‌గా బోటు రైడ్ చేసింది. ఉదయాన్నే జిమ్ సెషన్‌కు వెళ్లింది. ఆ తర్వాత తనకిష్టమైన పుస్తకం చదివింది. అలియాభట్ థాయ్‌లాండ్ వెకేషన్‌లో సూపర్ ఛిల్ అవుట్ మూడ్‌లో ఉన్న ఫొటోలు ఇప్పుడు నెట్టింటిని షేక్ చేస్తున్నాయి. అలియాభట్ ప్రస్తుతం అల్ఫా, లవ్ అండ్ వార్ సినిమాల్లో నటిస్తుండగా.. చిత్రీకరణ దశలో ఉన్నాయి.



# సాయికుమార్ నాలుగు సింహాలు కాదు

## 50 ఏళ్ల ప్రస్థానం

సాయి కుమార్ అంటే అందరికీ నాలుగు సింహాల డైలాగ్ గుర్తుకు వస్తుంది. పోలీస్ స్టోరీ సినిమాతో ఇండియన్ సినిమా హిస్టరీలో సాయి కుమార్ చెరగని ముద్ర వేసుకున్నారు. 1961 జులై 27న సాయి కుమార్ జన్మించారు. తండ్రి పి.జె.శర్మ, తల్లి కృష్ణ జ్యోతి నట వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్నారు సాయి కుమార్. తల్లి కృష్ణ జ్యోతి ఒకప్పుడు కన్నడ చిత్ర రంగంలో నటిగా సుప్రసిద్ధురాలు. అలా సాయి కుమార్‌కు కన్నడ మాతృ భాష అయింది. కానీ సాయి కుమార్ మాత్రం సౌత్ ఇండస్ట్రీపై తన మార్క్ వేశారు. సినిమాల్లోకి రాక ముందు అంటే.. సరిగ్గా 1972 అక్టోబర్ 20న తొలిసారి ముఖానికి రంగేసుకున్నారు. మయసభ నాటకంలో దుర్యోధనుడి పాత్రలో నటించారు. ఆ తర్వాత నటుడిగా వెనుదిరిగి చూసుకోలేదు. బాలనటుడిగా చిత్ర రంగ ప్రవేశం చేసిన సాయికుమార్ 'దేవుడు చేసిన పెళ్లి'తో తెరంగేట్రం చేశారు. ఆ సినిమా 1975లో జనవరి 9న రిలీజ్ అయింది. అంటే నేటికి యాభై ఏళ్లు పూర్తయ్యాయి. ఆ తరువాత బాపు దర్శకత్వం వహించిన స్నేహం సినిమాలో మంచి నటుడిగా గుర్తింపు సంపాదించుకున్నారు. సాయి కుమార్ కెరీర్‌లో ఎన్నో మరుపు రాని హిట్ చిత్రాలున్నాయి. కన్నడ, తెలుగులో ఎన్నో ఎవర్ గ్రీన్ చిత్రాల్లో ఆయన నటించారు. కన్నడలో పోలీస్ స్టోరీ తరువాత అగ్ని ఐపీఎస్, కుంకుమ భాగ్య, పోలీస్ స్టోరీ 2, లాకప్ డెత్, సర్కిల్ ఇన్స్పెక్టర్, సెంట్రల్ జైల్, మనే మనే రామాయణ తదితర చిత్రాలు బాక్సాఫీస్ ని కొల్లగొట్టాయి. ఇక తెలుగులో అమ్మ రాజీనామా, కర్తవ్యం, అంతఃపురం, ఈశ్వర్ అల్లా, జగద్గురు ఆది శంకర, ఎవడు,



పటాస్, పండుగ చేస్కో, భలే మంచి రోజు, సరైనోడు, సుప్రీం, చుట్టాలబ్బాయి, జనతా గారేజ్, మనలో ఒకడు, ఓం నమో వెంకటేశాయ, జై లవకుశ, రాజా ది గ్రేట్, నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా, మహర్షి, ఎస్ ఆర్ కళ్యాణమండపం, దసరా, సార్, ఇలా ఎన్నెన్నో చిత్రాల్లో నటించి మంచి పేరుని సంపాదించుకున్నారు. 2006లో సామాన్యుడు చిత్రంలోని పాత్రకు ఉత్తమ విలన్‌గా నంది అవార్డు అందుకున్నారు. 2010లో ప్రస్థానం చిత్రంలో ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డు సాధించారు. సామాన్యుడు, ప్రస్థానం, రంగ్ తరంగ్ చిత్రాలలో నటనకు గాను ఫిలిం ఫేర్ అవార్డులు కైవసం చేసుకున్నారు. ప్రస్థానం సినిమాకు టీఎస్సార్-టీవీ 9 అవార్డును అందుకున్నారు. ఇక వెండితెరపైనే కాకుండా మాంచి కిక్కిచ్చే గేమ్ షో అంటూ బుల్లితెరపై 'వావ్' అనిపించుకున్నారు సాయి కుమార్.

## రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల

- **తెలంగాణకు రూ.3,637 , ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,002 కోట్లు**

**న్యూఢిల్లీ,జనవరి10( వెలుతురు):**
దేశంలోని వివిధ రాష్ట్రాలకు కేంద్రం శుభవార్త చెప్పింది. పన్నుల్లో వాటా కింద తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలకు నిధులను విడుదల చ ఏసింది. దేశంలోని 28 రాష్ట్రాలు/యూటీలకు కలిపి జనవరి నెలకు మొత్తం రూ.1,73,030 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో తెలంగాణకు రూ.3,637 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,002 కోట్లు ఇచ్చింది. మూలధన వ్యయం, అభివృద్ధి, సంక్షేమానికి నిధులు విడుదల చేస్తున్నట్లు పేర్కొంది. కాగా.. గత నెల(డిసెంబర్)లో రూ. 89,086 కోట్లను పన్నుల్లో వాటా కింద రాష్ట్రాలకు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే.

## హోటల్ గదిలో ప్రేమజంట బలవన్మరణం

- **పెళ్లికి అంగీకరించలేదని..ఉరేసుకుని మృతి**

**సంగారెడ్డి,జనవరి10( వెలుతురు):**
సింగూరు ప్రాజెక్టు సమీపంలో ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి వద్ద హరిత రెస్టారంట్‌లో గురువారం మధ్యాహ్నం ప్రేమ జంట గదిని అద్దెకు తీసుకుంది. శుక్రవారం గది ఖాళీ చేయాల్సి ఉండగా వారు బయటకు రాకపోవడంతో సిబ్బంది కిటికీలు బద్దలుకొట్టి చూడగా.. ఫ్యాన్‌కు ఉరేసుకొని ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వారి తల్లిదండ్రులకు సమాచారమందించారు. మృతులను నారాయణఖేడ్ మండలం నారాయణపేట గ్రామానికి చెందిన ఉదయ్ (20), అదే గ్రామానికి చెందిన యువతిగా గుర్తించారు. ఇరువురి కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు అంగీకరించలేదని, ఆ మనస్తాపంతోనే ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

## రాజకీయాల్లో డబ్బుల ప్రమేయం ఎల్లవేళలా పనిచేయదు

- **నిఖిల్ కామత్ ప్రశ్నలకు మోడీ సందేశాత్మక సమాధానం**



**న్యూఢిల్లీ,జనవరి10( వెలుతురు):**
పాలనా వ్యవహారాల్లో నిత్యం తలమునకలై ఉండే ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొలిసారి ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహిస్తున్న పాడ్‌కాస్ట్‌లో అతిథిగా విచ్చేశారు. ఈ ఇంటర్వ్యూకు సంబంధించిన పూర్తి వీడియోను తాజాగా విడుదల చేశారు. ఇందులో నిఖిల్ అడిగిన ప్రశ్నలకు ప్రధాని సమాధానం చెబుతూ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. రాజకీయాల్లోకి రావాలంటే భారీగా డబ్బులు అవసరమా? అని అడగ్గా.. మోదీ తాను చిన్నతనంలో స్వయంగా చూసి తెలుసుకున్న ఓ విషయాన్ని చెప్పారు. డబ్బులే ఎల్లవేళలా ప్రభావితంచేయవని అన్నారు. ప్రజలు కూడా మంచి వ్యక్తి కోసం అన్వేషిస్తుంటారని అన్నారు. రాజకీయాల్లోకి వస్తారా అని యువతను అడిగితే అందుకు చాలా డబ్బులు ఉండాలి అని అంటున్నారు. సాధారణంగా ఇండస్ట్రీలో మేం స్టార్టప్ పెట్టాలంటే మా స్నేహితులనో, కుటుంబసభ్యులనో డబ్బులు అడుగుతాం. మరి రాజకీయాల్లో ఎలా?' అని నిఖిల్ కామత్ ప్రధానిని అడిగారు. ప్రధాని బదులిస్తూ.. 'మా ఊర్లో ఓ డాక్టర్ ఉండేవారు. ఆయన మంచి కంటి వైద్య నిపుణుడు. తన దగ్గరకు వచ్చే వారిని ఎంతో ప్రేమగా, జాగ్రత్తగా చూసుకునేవారు. మంచి వక్త కూడా. ఓసారి ఆయన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలనుకున్నారు. అప్పుడు నేను బాలసేనలో పనిచేస్తున్నా. ఆ వైద్యుడి వద్ద డబ్బులు లేకపోవడంతో తనకు తెలిసిన వారందరి దగ్గరకు వెళ్లి రూపాయి రూపాయి విరాళం తీసుకున్నారు. ఆ డబ్బుతో ఎన్నికల్లో పోటీ చేశారు. కేవలం రూ.250 మాత్రమే ఖర్చు చేశారు. అయినప్పటికీ ఎన్నికల్లో విజయం సాధించారు' అని మోదీ నాటి సంఘటనను వివరించారు. 'ఈ సమాజం వాస్తవాలను అంగీకరించదు అనేది నిజం కాదు. మనకు ఓపిక, అంకితభావం ఉండాలి. ఓట్ల కోసం ఏదైనా చేస్తామనుకునే కాంట్రాక్ట్ విధానాన్ని వదులు కోవాలి. అలాంటి వైఖరితో మీరు విజయం సాధించలేరు. ఈ ప్రజాస్వామ్య సమాజంలో ఓటరు కూడా ఓ రాజకీయ నాయకుడే. ఓటు వేసేటప్పుడు వారు ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు' అని మోదీ వ్యాఖ్యానించారు.


## తిరుమల ఘటనలో ఎవ్వరినీ ఉపేక్షించం

- **నేడు మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ**
- **తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం**

**తిరుమల,జనవరి10( వెలుతురు):**
వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి బాధ్యులను ఉపేక్షించే ప్రసక్తే లేదని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం తిరుమల అన్నమయ్య భవన్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సమావేశం జరిగింది. అనంతరం బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ సమావేశం వివరాలను వెల్లడించారు. 'తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన దురదృష్టకరం. చిన్న చిన్న పొరపాట్లు జరిగాయని మా దృష్టికి వచ్చింది. ఘటనపై ఇప్పటికే సీఎం న్యాయవిచారణకు ఆదేశించారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో జరగకుండా చూస్తాం అని అన్నారు. అయితే ఇందులో ఏదైనా కుట్ర కోణం ఉందా అన్న అనుమానాలను కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు. మృతుల కుటుంబాలకు చెక్కులు సిద్ధం చేశాం. శనివారం ఉదయం బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేస్తాం. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తాం. క్షమాపణ చెప్పడంలో తప్పులేదు. క్షమాపణ చెప్పినంత మాత్రాన చనిపోయిన వాళ్లు తిరిగిరారు. ఎవరో ఏదో మాట్లాడారని వాటన్నింటికీ స్పందించాల్సిన అవసరం లేదు. తప్పిదం జరిగింది.. ఎలా జరిగింది అనేది విచారణలో తేలుతుంది. విచారణ త్వరగా పూర్తి చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లాం. ఆ తర్వాతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని నాయుడు తెలిపారు.

# లొట్టపీసు కేసులో కెటిఆర్ అరెస్ట్ అయితే..?

- **పార్టీని ముందుకు తీసుకెళ్లేదెవరో..**
- **పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న చర్చ ఇదే**
- **పెద్దాయన ఫామ్‌హౌజ్ వీడి వస్తారా అన్నది అనుమానమే**



**హైదరాబాద్,జనవరి10( వెలుతురు):**
బీఆర్ఎస్ పార్టీ అంటే కేసీఆర్ కుటుంబ సభ్యులు, బంధువుల పార్టీ అన్నది జగమెరిగిన సత్యం. పార్టీ అంతా కెసిఆర్, కెటిఆర్, కవితల ఆధ్వర్యంలో నడుస్తుంది. పైకి హరీష్ రావు కనిపిస్తున్నా..ఆయనది నిమిత్తమైన పాత్ర. ఆయన గగ్గోలు బ్యాచ్‌లో ఉంటారు. అందుకే కేటీఆర్‌పై కేసు నమోదు కాగానే అడ్డదిడ్డమైన వాదనలు, అరుపులతో గగ్గోలు పెట్టాలని చూశారు. మొత్తంగా గతంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలుగా పనిచేసి వారంతా వచ్చి తమ సానుభూతి ప్రకటించి, దారాన్ని తాడులా పేనినట్లుగా ఒక్కటి కావాలనే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో భూకంపం వచ్చిందన్న భ్రమలు కలగించే పరిస్థితి ఉన్నట్లుగా చూపిస్తున్నారు. ఈ క్రమంలో కెసిఆర్ ఫామ్‌హౌజ్ వీడి బయటకు రావడం లేదు. ఒకవేళ కెటిఆర్ అరెస్ట్ అయితే పార్టీని ఎవరు నడిపిస్తారన్న చర్చ సాగుతోంది. ఎందుకంటే నేరుగా హరీష్ రావు చేతిలో పగ్గాలు పెట్టడం ఆ ఇంటి పెద్దలకు ఇష్ట లేదు. కెటిఆర్ పరోక్షంలో బీఆర్ఎస్ పార్టీని ఎవరు నడిపించాలనే దానిపై కేసీఆర్ కూడా చర్చిస్తున్నట్టు తెలుస్తోంది. ఫార్ములా ఈ రేస్ కేసులో ప్రభుత్వం వద్ద ఇప్పటికే అనేక బలమైన సాక్ష్యాధారాలు ఉన్నాయి. ఈ కేసు ఊరికే ముగిసేది కాదు. దర్యాప్తు జరుగుతూ పోతుంటే, మరిన్ని కొత్త విషయాలు బయటకు వచ్చేట్లున్నాయి. ఇలాంటి స్థితి కనిపిస్తున్న సందర్భంలో కేటీఆర్ చాలా అసహనానికి గురవుతున్నారని ఆయన ఎదురుదాడి విమర్శను బట్టి అర్థం చేసుకోవచ్చు. పైసా అవినీతి జరగలేదు..ప్రభుత్వ పరంగా జరగాల్సిన విచారణలో అవినీతి ఎక్కడుందని, ఇంకా గట్టిగా వాదిస్తూ.. లొట్టపీసు కేసు అని పదేపదే చెబుతున్నారు. ఇది ఆయనలోని అసహనాన్ని బయటపెడుతున్నాది. ఆయన లాయర్లు ఇది లొట్టపీసు కేసు కదని చెప్పే ఉంటారు. పదేపదే ఇదే పదం వాడుతూ, సిఎం ర ఏవంత్ రెడ్డిని కూడా అనరాని మాటలతో విమర్శలు చేస్తూ.. తనలోని ఇకపోతే÷–స్టేషన్‌ను బయటపెట్టుకుంటున్నారు. వందిమాగధులు చేరి, ఎంతగా ఎదురుదాడికి పూనుకున్నా ఈ లొట్టపీసు గట్టి కేసు అని మున్ముందు రుజువు కాబోతున్నదనడంలో సందేహం అక్కర్లేదు. కపోతే ఈ లొట్టపీసు కేసులో 'విదేశీ కంపెనీకి పురపాలకశాఖ నేరుగా నిధులు చెల్లిస్తే చట్టపరమైన సమస్యలు వస్తాయిన కేటీఆర్‌కు తెలియంది కాదు. కెటిఆర్ కూడా మళ్లీ తామే అధికారంలోకి వచ్చేది కనుక ఏమీ కాదన్న ధోరణిలో అతి విశ్వాసంతో,,,అంతా తాను చూసుకుంటానని ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్‌కు భరోసా ఇచ్చి వుంటారు. ప్రజాధనం దుర్వినియోగమవుతుంటే కాపాడలేకపోవడం వాస్తవమే అన్న నిజాన్ని ఈ లొట్టపీసు కేసులో ఏ2గా ఉన్న నాటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్ గుర్తించి వుంటారు. ఎసిబి విచారణలో ఆయన తప్పకుండా నిజాలు చెప్పేవుంటారు. కేబినెట్ ఆమోదం లేకపోవడం, ఆర్థికశాఖ అనుమతి తీసుకోకపోవడం వంటివి కెటిఆర్ మంత్రిగా తెలుసుకోకుండా చేసిన పనులు. అయితే ఏమీ కాదులే ..అంత మనదే రాజ్యం అన్న ధీమాలో కెటిఆర్ ఉండివుంటారు. అంతేనా అంటే ఇక కాబోయే సిఎంను నేనే అని కూడా భావించి ఉంటారు. అందుకే ఈ బరితెగింపు నిర్ణయం తీసుకుని ఉంటారు. సాధారణంగా ఇలాంటి కేసుల్లో ఎక్కువగా డాక్యుమెంట్లు, ఇతర ఆధారాల అనుగుణంగానే విచారణ జరుగుతుంది. ఇలాంటి విషయలు ఏవైనా అరవింద్ కుమార్ ఎసిబికి అందించివుంటే .. కేటీఆర్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయినట్లేనని భావించాలి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినతర్వాత ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి లేదు. అలాంటిది ఓ విదేశీ కంపెనీకు డబ్బు చెల్లింపులు చేయడం మరీ నేరం. ఇకపోతే ఫార్ములా- ఈ కార్ రేసింగ్ స్కాంలో ప్రాథమిక ఆధారాలున్నట్టు హైకోర్టు స్పష్టం చేయడం బీఆర్ఎస్‌ను వణికిస్తోంది. గత వారం రోజులుగా కేటీఆర్ ప్రదర్శిస్తున్న అసహనం ఆయన తప్పును బయటకు వెల్లడిస్తోంది. తనతోపాటు తన అడ్వకేట్లను అనుమతిస్తేనే విచారణకు హాజరవుతానని మొండికేయడం, విచారణకు రాకుండా వెనక్కి వెళ్లిపోవడం ద్వారా ఆయన తన దురుసుతనాన్ని ప్రదర్శించారు. ఈ కేసు మొదలయినప్పటి నుంచి గమనిస్తే...చట్టాలకు తాము అతీతులమనే అహంభావం ఆయన ప్రవర్తనలో కనిపిస్తున్నది. అంతేకాదు.. ఈ వ్యవహారంలో ఏసీబీ, ఈడీ కేసులు నమోదుచేసిన నాటి నుంచి కేటీఆర్ మీడియా ముందు దురుసుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ కేసు ను ఓ లొట్టపీసు కేసుగా అభివర్ణించారు. ఆయనో లొట్టపీసు ముఖ్యమంత్రి అంటే ఇంకా పలురకాలుగా నోరుపారేసుకుంటూనే ఉన్నారు. ఎసిబి విచారణ నుంచి బయటకు వస్తున్న సందర్భంలో మీడియాతో మాట్లాడ వద్దన్నందుకు కూడా నోరుపారేసుకున్న తీరును చూశాం. కేసులకు, జైళ్లకు భయపడేది లేదని అంటూ వీరావేశం ఎత్తుతున్నారు.కానీ, ఆయన హైకోర్టు, సుప్రీంకోర్టు చుట్టూ తిరుగుతుండటం చూస్తే.. కేసులో దమ్ముందని, తనకు చుట్టుకుంటోందని గమనించి ఉంటారు. అందుకే కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు బయలుదేరుతూ, ఎసిబి విచారణ నుంచి వచ్చిన తరవాత కూడ మీడియా ముందుకువచ్చి, ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్ రెడ్డిని విచక్షణా రహితంగా దూషించిన తీరు సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేలా చేసింది. కేసును రాజకీయ ప్రేరేపిత కుట్రగా చూపే ప్రయత్నంలో భాగంగా అసభ్యకర వ్యాఖ్యలను, అసంబద్ధ సవాళ్లను చేస్తున్నారు. నిజానికి నిబంధనలు పాటించకుండా పెద్ద మొత్తంలో నిధులు బదిలీ చేయడంతో హెచ్ఎండీఏ ఆదాయపన్ను శాఖకు రూ.8 కోట్లకు పైగా జరిమానా చెల్లించాల్సి వచ్చింది. ఇదంతా ఒక ఎత్తయితే ఇక కెటిఆర్ స్థానంలో ఎవరుండి పార్టీని నడపాలన్నది వారి ముందున్న సమస్య. బహుశా కవిత ఈ భారన్ని భుజాన వేసుకునే అవకాశం లేకపోలేదు.

# రియల్‌ఎస్టేట్ రంగం అభివృద్ధికి కృషి

**- రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ**

**విజయవాడ, జనవరి 10 ( వెలుతురు):**
రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శుక్రవారం విజయవాడలో క్రెడాయ్ ప్రాపర్టీ షోను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామమోహన్, బోడే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, గత ఐదేళ్లలో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా దెబ్బతిందని అన్నారు. భవన నిర్మాణాలు, లే అవుట్లు అనుమతులను సులభతరం చేస్తూ జీవోలు జారీ చేశామని చెప్పారు. దేశంలోని 10 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి సరళమైన నిబంధనలు రూపొందించామని తెలిపారు. లే అవుట్‌లలో రోడ్లను 12 మీటర్ల నుంచి 9 మీటర్లకు తగ్గించామన్నారు.15 మీటర్లలోపు భవనాలు నిర్మాణాలకు ఎలాంటి అనుమతి లేకుండా లైసెన్స్‌డ్ సర్వేయర్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నామని తెలిపారు. రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. భవన నిర్మాణాల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా సింగిల్ విండో విధానం అమల్లోకి తెస్తున్నామని, ప్రాపర్టీ షోలో నిర్వహణ ద్వారా కొనుగోలుదారులకు అవగాహన వస్తుందన్నారు. ప్రతి ఏటా రెండు సార్లు రియల్ ఎస్టేట్ అసోసియేషన్‌ల ప్రతినిధులతో సమావేశం అవుతానని, ఎవరికి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. కాగా భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతులకు సంబంధించి నిబంధనలను సులభతరం చేస్తూ ఏపీ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ బిల్డింగ్ రూల్స్ -2017, ఏపీ ల్యాండ్ డెవలప్మెంట్ రూల్స్ - 2017లో సవరణలు చేస్తూ వేర్వేరుగా ప్రభుత్వం జీవోలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా భవన, లే అవుట్ల అనుమతుల్లో మార్పులు తీసుకువచ్చామని అన్నారు. ఏపీలో రియల్ ఎస్టేట్ రంగం పెరిగేలా కీలక సంస్కరణలతో ఉత్తర్వులు జారీ చేశామని మంత్రి నారాయణ తెలిపారు. సంక్రాంతి కానుకగా బిల్డర్లు, డెవలపర్లు, ప్రజలకు అనుకూలంగా ఉండేలా నిబంధనల్లో మార్పులు చేస్తూ జీవోలు జారీ చేశామని అన్నారు. లే అవుట్లలో రోడ్లకు గతంలో ఉన్న12 మీటర్లకు బదులు 9 మీటర్లకు కుదిస్తూ సవరణ చేశామని చెప్పారు. 500 చ.మీ. పైబడిన స్థలాలు, నిర్మాణాల్లో సెల్లారుకు అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. టీడీఆర్ బాండ్ల జారీ కమిటీలో రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్‌లు తొలగిస్తూ జీవో జారీ చేశామని తెలిపారు. రాష్ట్ర, జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న స్థలాలు డెవలప్ చేసేందుకు 12 మీ.సర్వీస్ రోడ్డు ఏర్పాటు నిబంధన తొలగించినట్లు చెప్పారు. బహుళ అంతస్తుల భవనాల సెట్ బ్యాక్ నిబంధనల్లో మార్పులు చేశామన్నారు. వీటితో పాటు మరిన్ని నిబంధనలు సులభం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు. రియల్ ఎస్టేట్ అసోసియేషన్‌ల ప్రతినిధులతో చర్చించి తుది నిబంధనలు జారీ చేసినట్లు వివరించారు. తాజా ఉత్తర్వులతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం వేగం పుంజుకోనుందని మంత్రి నారాయణ ప్రకటించారు.

# మేము మళ్లీ తిరిగి వస్తున్నాం..

- **తిరిగి బిజెపిలో చేరని మాజీ సిఎం రఘువరదాస్**

**రాంచీ,జనవరి10( వెలుతురు):**
మేము తిరిగి వస్తామనే నినాదంతో జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, ఒడిశా గవర్నర్ రఘువర్ దాస్ తిరిగి బీజేపీలో చేరారు. శుక్రవారం రాంచీలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రఘువర్ దాస్ రెండోసారి పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. బీజేపీ సభ్యత్వం తీసుకున్న తర్వాత, రఘువర్ దాస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. 'ఒడిశా గవర్నర్ పదవికి రాజీనామా చేయడం ద్వారా, ఆయన ఇప్పుడు తన పాత పాత్రకు తిరిగి వస్తున్నట్లు చెప్పారు. గవర్నర్‌గా ఉండటం గౌరవానికి సంబంధించిన విషయమన్నారు. 2024 సంవత్సరం నుంచి పాఠాలు నేర్చుకుంటూ 2025 కొత్త సంవత్సరంలో కొత్త శక్తి, కొత్త ఉత్సాహం, కొత్త ఉత్సాహంతో, అందరూ బీజేపీ కార్యకర్తలు ప్రజా ప్రయోజనాల కోసం పోరాడి విజయం సాధించాలని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. జనవరి 10 తనకు చారిత్రాత్మకమైన రోజు అని రఘువర్ దాస్ అన్నారు. 1980లో ఈ రోజున, ఆయన బీజేపీలో ప్రాథమిక సభ్యుడయ్యారు. ఇప్పుడు ఆయన రెండో సారి బీజేపీ సభ్యత్వాన్ని తీసుకుంటున్నారు. తాను గవర్నర్‌గా నియమితుడైనప్పుడు, 2023 అక్టోబర్ 26న న్యూఢిల్లీలో జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డాను లిసి తన రాజీనామాను



సమర్పించినప్పుడు, అది తన జీవితంలో చాలా భావోద్వేగ క్షణం అని ఆయన అన్నారు. రాజకీయ జీవితంలో గెలుపు, ఓటములు ఉంటాయని రఘువర్ దాస్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గెలుపు, ఓటమి జీవితంలో ఒక భాగమని అన్నారు. 1984లో బీజేపీకి ఇద్దరు ఎంపీలు ఉన్నప్పుడు ప్రతిపక్షాలు 'హమ్ దో హమారే దో' అని ఎగతాళి చేశాయని, ఆ రోజును ప్రజలు చూశారని పేర్కొన్నారు. కానీ మీ అందరికీ తెలుసు, ఇప్పుడు బీజేపీ దేశాన్ని అంతిమ స్థాయికి తీసుకెళ్లే దిశగా కొనసాగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేయడానికి అధికారం మనకు ఒక సాధనమని ఆయన అన్నారు. ఈ కారణంగా ప్రధానమంత్రి నాయకత్వంలో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వరుసగా మూడవసారి అధికారంలోకి వచ్చింది. నేడు, భారతీయ జనతా పార్టీ, ఎన్డీఏ ప్రభుత్వాలు దేశంలోని 22 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నాయని రఘువర్ దాస్ తెలిపారు. జార్ఖండ్ ప్రజలు ఇచ్చిన ఆదేశాన్ని తాను గౌరవిస్తున్నానని మాజీ ముఖ్యమంత్రి రఘువర్ దాస్ అన్నారు. జార్ఖండ్ ప్రజలు ఇండియా అలయన్స్ ప్రభుత్వానికి పాలించడానికి మెజారిటీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ఆధారంగా ఇండియా అలయన్స్‌కు ఆధిక్యం లభించిందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని ఆయన అన్నారు. సంకీర్ణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడానికి పార్టీ కొన్ని నెలలు మాత్రమే వేచి చూస్తుందన్నారు. లేకపోతే బీజేపీ వీధుల నుంచి సభ వరకు ప్రజా ప్రయోజన అంశాలపై వాగ్దానాలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బాబులాల్ మరాండి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్ర రాయ్, కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, ఎంపీ మనీష్ జైస్వాల్, రాజ్యసభ ఎంపీ ఆదిత్య సాహు, మాజీ ప్రతిపక్ష నాయకుడు అమర్ బౌరి, ఎమ్మెల్యే సహా అనేక మంది బీజేపీ నేతలు నీరా యాదవ్, అలోక్ చౌరాసియా సహా పలువురు హాజరయ్యారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com